# ప్రజాక్షేత్రం
PRAJA KSHETRAM

prajakshetram.in



అతి కొద్ది కాలంలోనే ఆదరణ పొందిన 'ప్రజాక్షేత్రం'
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని మండలాల వారిగా
నియోజకవర్గాల వారిగా, జిల్లాల వారిగా
రిపోర్టర్లు కావలెను
అనుభవం గలవారికి ప్రాధాన్యం ఇవ్వబడును
ప్రజాక్షేత్రం
కాల్ : 9177920459



సంపుటి - 01 | సంచిక - 220 | హైదరాబాద్ | శనివారం | 23- 11 -2024 | పేజీలు - 6 | వెల.4/-


### చెరువుల ఆక్రమణలపై
## హైడ్రా దృష్టి

- అధికారులతో కీలక సమావేశంలో నిర్వహించిన రంగనాథ్




**హైదరాబాద్,నవంబర్22ప్రజాక్షేత్రం:**

ఇకపై చెరువులు అన్యాక్రాంతం కాకుండా హైడ్రా చీఫ్ రంగనాథ్ కీలక నిర్ణయాలు తీసుకున్నారు. హైడ్రా ఈ ఏడాది జూలైలో ఏర్పడిందని.. అర్బన్ డిజాస్టర్స్, ఎంక్రోచ్‌ల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిందని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. శుక్రవారం బుద్ధ భవన్ హైడ్రా కార్యాలయంలో మధ్యాహ్నం 2 గంటలకు కమిషనర్ రంగనాథ్ కీలక సమావేశం నిర్వహించారు. రిటైర్డ్ ఈఎన్సీలు, ఇరిగేషన్ సీఈలు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సీనియర్ అధికారులతో సమీక్ష సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కనుమరుగైన చెరువులపై సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడారు. చెరువులకు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లను అధికారులు నిర్ణయించారు.'ఐఎండీ 1875లో ఏర్పడింది. హైడ్రా జీహెచ్ఎంసీలో భాగం కాదు. ఇది వరకు ఈవీడీఎం పేరుతో జీహెచ్ఎంసీలో భాగంగా ఉండేది.. అప్పుడు ఐఏఎస్‌లు, కమిషనర్లు ఉండేవారు. ఇప్పుడు సెపరేట్ వింగ్‌గా ఏర్పడింది. హైడ్రాకు మిగతా 2లో..

# భారతీయ సంస్కృతీ సంప్రదాయాలు గొప్పవి

- వాటిని మరింతగా పటిష్టం చేసుకోవాలి
- లోక్‌మంథన్ కార్యక్రమంలో రాష్ట్రపతి పిలుపు
- రెండురోజుల పర్యటన ముగించుకుని ఢిల్లీకి ప్రయాణం
- బేగంపేటలో గవర్నర్ తదితరుల వీడ్కోలు



**హైదరాబాద్,నవంబర్22ప్రజాక్షేత్రం:**

భారతీయ సంస్కృతి, ఆచారాలను నిరంతరం పటిష్ఠం చేయాల్సి ఉందని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అన్నారు. హైదరాబాద్‌లోని శిల్పారామంలో లోక్‌మంథన్ ప్రధాన కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడారు. దేశ ప్రజల్లో సాంస్కృతిక, స్వాభిమాన్ భావన నెలకొల్పాల్సి ఉందని చెప్పారు. రాష్ట్రాలను బలోపేతం చేసే దిశగా లోక్ మంథన్ కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. '2018లో రాంచీలో లోక్‌మంథన్ కార్యక్రమంలో పాల్గొన్నా. భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పటిష్ఠానికి ఈ ప్రయత్నం గొప్పది. ఇందులో పాల్గొంటున్న ప్రతి ఒక్కరిని అభినందిస్తున్నా. భిన్నత్వంలో ఏకత్వం భారతీయ మిగతా 2లో..

### అనర్హతపై స్పీకర్‌దే
## తుది నిర్ణయం

- తగిన సమయంలో నిర్ణయం తీసుకునే అధికారం
- ఐదేళ్ల అసెంబ్లీ కాలం దృష్టిలో పెట్టుకోవాలని సూచన
- నాలుగు వారాల గడువు పెడుతూ ఇచ్చిన తీర్పు కొట్టివేత
- అనర్హత పిటిషన్‌పై హైకోర్టు సిజె ధర్మాసనం సంచలన తీర్పు





**హైదరాబాద్,నవంబర్22ప్రజాక్షేత్రం:**

ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు స్పష్టమైన తీర్పునిచ్చింది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌లపై షెడ్యూలు ఖరారు చేయాలంటూ సింగిల్ జడ్జి ఇచ్చిన మిగతా 2లో..

### ఆంధ్రప్రదేశ్ ప్రతిష్ఠ, బ్రాండ్‌ను
## దెబ్బతీసిన వైకాపా పాలన

- వ్యవస్థలను నిర్వీర్యం ...అప్పుల కుప్పగా ఆర్థిక రంగం
- ఇప్పుడిప్పుడే గాడిలో పెట్టే ప్రయత్నాలు చేపట్టాం
- వెల్త్, హెల్త్, హ్యాపీ ఆంధ్రప్రదేశ్ నినాదంతో ముందుకు
- అసెంబ్లీలో సిఎం చంద్రబాబు వెల్లడి



**అమరావతి,నవంబర్22ప్రజాక్షేత్రం:**

ఆంధ్రప్రదేశ్ ప్రతిష్ఠ, బ్రాండ్‌ను దెబ్బతీసేలా వైకాపాపాలన సాగిందని ఏపీ సీఎం చంద్రబాబు విమర్శించారు. అన్ని వ్యవస్థలను దెబ్బతీసారని, ఆర్థికంగా దోచుకున్నారని మండిపడ్డారు. మళ్లీ ఎపిని గాడిలో పెట్టేందుకు నానా అగచాట్లు పడుతున్నామని శాసనసభ సమావేశాల్లో ఆయన వెల్లడించారు. 'జగన్ చేసిన అవినీతి అంశాన్ని ప్రస్తావించడానికి కూడా ఇబ్బందికరమైన పరిస్థితి. ఆంధప్రదేశ్ ప్రభుత్వం ఈ అంశాన్ని జాగ్రత్తగా గమనిస్తోంది. మరింత సమాచారం తీసుకుని తగిన విధంగా స్పందిస్తాం. మరొకరు ఇలాంటి తప్పులు చేయకుండా చూస్తాం. అమెరికా కోర్టులో వేసిన ఛార్జిషీట్ కూడా మా దగ్గర ఉంది. దీనిపై అధ్యయనం చేసి ఎలాంటి చర్యలు చేపట్టాలో నిర్ణయం తీసుకుంటాం' అని చంద్రబాబు తెలిపారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనను బ్యాలెన్స్ చేస్తూ కార్యక్రమాలు చేపడుతున్నామని సీఎం చంద్రబాబుఅన్నారు. చరిత్రలో మిగతా 2లో..

### సమర్ధంగా కేంద్ర ప్రభుత్వ
## పథకాల వినియోగం

- కలెక్టరేట్‌లో దిశ సమావేశంలో కోటిరెడ్డి సూచన

**నల్లగొండ,నవంబర్22ప్రజాక్షేత్రం:**

కేంద్ర ప్రభుత్వ పథకాల నిధులను సమర్ధవంతంగా వినియోగించుకోవాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖమంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సూచించారు. నల్లగొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన కేంద్ర విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశానికి స్థానిక ఎంపీ రఘువీర్ రెడ్డి అధ్యక్షత వహించగా,



జిల్లా ఇంచార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ పథకాలను మిగతా 2లో...

### ముగిసిన ఏపీ
## అసెంబ్లీ సమావేశాలు

- 21 బిల్లులకు ఆమోదం తెలిపిన సభ
- మండలిలో 8 బిల్లలుకు ఆమోదం

**అమరావతి,నవంబర్22ప్రజాక్షేత్రం:**

ఏపీఅసెంబ్లీ సమావేశాలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. పదిరోజుల పాటు జరిగి



న సమావేశాలు శుక్రవారంతో ముగిసాయి. దాదాపు 60 గంటలపాటు సమావేశాలు జరిగాయని అసెంబ్లీ స్పీకర్ మిగతా 2లో...

### ఇన్ఫార్మర్ నెపంతో
## అన్నదమ్ముల దారుణ హత్య

- ములుగు జిల్లాలో మావోయిస్టుల ఘాతుకం




### ఆదానీతో ఒప్పందాలు
## రద్దు చేసుకోవాలి

- కాంగ్రెస్ డబుల్ స్టాండర్డ్ విధానాలు వీడాలి
- ఒప్పందాలు రద్దు చేసుకునేలా రాహుల్ చర్య తీసుకోవాలి
- మీడియా సమావేశంలో కెటిఆర్ డిమాండ్

**హైదరాబాద్,నవంబర్22ప్రజాక్షేత్రం:**

పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ విషయంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో ఒకలా, గల్లీలో మరోలా మాట్లాడున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ మిగతా 2లో...



## సన్నాలకు 500 బోనస్ విడుదల

- రైతుల ఖాతల్లోకి నేరుగా జమ

**హైదరాబాద్,నవంబర్22ప్రజాక్షేత్రం:**

సన్నాలు పండించిన అన్నదాతల ముఖాల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. రైతుల ఖాతాల్లో క్వింటాకు రూ. 500 చొప్పున బోనస్ డబ్బులు జమవుతున్నాయి. శుక్రవారం పలు జిల్లాల రైతుల ఖాతాల్లో బోనస్ డబ్బులు జమయ్యాయి. ఇందుకు సంబంధించిన మెస్సేజ్ లు రైతుల మొబైల్ ఫోన్లకు వస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం బోనస్ ఇస్తామని ప్రకటించడంతో సన్న రకాల ధాన్యం మార్కెట్లోకి పోటెత్తుతోంది. ఈ వానాకాలం సీజన్‌లో 66.77 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. గతానికి భిన్నంగా దొడ్డు రకాల సాగు తగ్గి, సన్నాల సాగు పెరిగింది. సన్నాలకు సర్కార్ రూ.500 బోనస్ ప్రకటించడంతో వీటి సాగు గతంతో పోలిస్తే ఏకంగా 61శాతం పెరిగింది. పోయినేడు వానాకాలంలో వరి సాగు



విస్తీర్ణంలో సన్నాల వాటా 25.05 లక్షల ఎకరాలు (38 ?) ఉంటే.. ఈ సారి అది 40.44 లక్షల ఎకరాలకు పెరిగింది. గత ఏడాది వానాకాలంలో 40.89 లక్షల ఎకరాల్లో దొడ్డు వడ్లు సాగైతే, ఈసారి అది 26.33 లక్షల ఎకరాలకు తగ్గింది. సాగు గణనీయంగా మిగతా 2లో...

## ఆదానీతో మోడీది ఆర్థిక బంధం

- ఆదానీని వెంటనే అరెస్ట్ చేయాలి
- తెలంగాణలో ఆదానీకి ఇంచుభూమిా ఇవ్వలేదు
- కెటిఆర్ వ్యాఖ్యలపై మహేశ్ కుమార్ గౌడ్ మండిపాటు

**హైదరాబాద్,నవంబర్22ప్రజాక్షేత్రం:**

దిగ్గజ పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ లంచం వ్యవహారం తెలంగాణ రాజకీయాలను వేడెక్కిస్తోంది. అదానీ అంశంలో కాంగ్రెస్ అగ్రనేత




రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ కౌంటర్ ఇచ్చారు. అలాగే ప్రధాని మోదీపైనా నిప్పులు చెరిగారు. మిగతా 2లో...

# ఆదానీతో మోడీది ఆర్థిక బంధం

మెదటిపేజీ తరువాయి

స్కిల్ యూనివర్సిటీకి అదానీ నుంచి తెలంగాణ సర్కార్ రూ.100 కోట్లు తీసుకోవడం తప్పు కాదా అని కేటీఆర్ ప్రశ్నించడంపై మహేశ్ గౌడ్ స్పందించారు. స్కిల్ యూనివర్సిటీకి కేటీఆర్ విరాళం ఇచ్చినా తీసుకుంటామంటూ ఆయన చురకలు అంటించారు.అదానీ కుంభకోణాన్ని అమెరికా అధికారులు బట్టబయలు చేసినందున వెంటనే అతన్ని అరెస్టు చేయాలని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ డిమాండ్ చేశారు. అదానీ దాదాపు రూ.2వేల కోట్ల మేర లంచాలు పంచారు. ఆయన అవినీతిపై రాహుల్‌గాంధీ ఎన్నిసార్లు చెప్పినా ఎవరూ స్పందించలేదు. అర్హత లేకపోయినా అదానీకి రూ.వేల కోట్ల రుణాలు ఇచ్చారు. ప్రధాని మోదీ అండతో అనేక విమానాశ్రయ కాంట్రాక్టులు చేజిక్కించుకుని అవినీతి సామ్రాజ్యం స్థాపించారని అన్నారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అదానీపై వచ్చిన అవినీతి ఆరోపణలపై విచారణ జరిపేందుకు తక్షణమే జాయింట్ పార్లమెంటరీ కమిటీ(జేపీసీ) ఏర్పాటు చేయాలని కోరారు. 2014 తర్వాత అదానీ సంపద ఎలా పెరిగిందో చూశాం. రూ.100 కోట్ల అవినీతి జరిగిందని చెప్పి సీఎంలను జైల్లో వేశారు. రూ.వేల కోట్ల అవినీతికి పాల్పడిన అదానీపై చర్యలేవని మహేశ్‌కుమార్‌గౌడ్ ప్రశ్నించారు. అదానీకి కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో ఇంచు భూమి ఇవ్వలేదని టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ తెలిపారు. నేరం రుజువైతే అదానీతో కాంగ్రెస్ ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలను రద్దు చేసుకుంటామని ఆయన తేల్చి చెప్పారు. అదానీ అరెస్టయితే ప్రధాని మోదీ రాజీనామా తప్పదని టీపీసీసీ చీఫ్ జోస్యం చెప్పారు. అదానీ ఆర్థిక నేరంలో మోదీకీ భాగస్వామ్యం ఉందంటూ మహేశ్ గౌడ్ సంచలన ఆరోపణలు చేశారు. అదానీని వెంటనే అరెస్టు చేయాలని, లంచం అంశంపై జేపీసీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అదానీ అరెస్టయితే అనేక అంశాలు బయటకి వస్తాయని చెప్పుకొచ్చారు. మోదీ ప్రభుత్వంలో ఆయన వేల కోట్ల లబ్ధి పొందారని, అదానీ ఆగడాలపై రాహుల్ ఎన్నిసార్లు ప్రశ్నించినా మోదీ కనీసం స్పందించలేదని మహేశ్ గౌడ్ మండిపడ్డారు. అర్హత లేకున్నా అదానీ రుణాలు పొందారని, ఆయన వల్ల ప్రజలపై పెను భారం పడిందని ఆగ్రహించారు. అనేక దేశాలనూ అదానీ మోసం చేశారంటూ టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ధ్వజమెత్తారు. కెన్యా దేశం మాదిరిగా తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం సైతం అదానీతో చేసుకున్న ఒప్పందాలను వెంటనే రద్దు చేయాలని బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేస్తోంది. అదానీ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ.. ఢిల్లీలో ఒకలా తెలంగాణలో మరోలా మాట్లాడుతున్నారని మాజీ మంత్రి కేటీఆర్ మండిపడ్డారు. అదానీ అవినీతిపరుడు అయినప్పుడు సీఎం రేవంత్ రెడ్డి నీతిపరుడు ఎలా అవుతాడో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. స్కిల్ యూనివర్సిటీకి అదానీ నుంచి రేవంత్ రెడ్డి సర్కార్ రూ.100 కోట్లు తీసుకోవడం తప్పు కాదా అంటూ ప్రశ్నించారు. కోహినూరు హోటల్లో మంత్రి పొంగులేటి, అదానీ రహస్య సమావేశం నిజం కాదా అంటూ ధ్వజమెత్తారు. అదానీతో దేశానికి నష్టమైతే తెలంగాణకు నష్టం కాదా అంటూ ప్రశ్నించారు. రాహుల్ గాంధీకి చిత్తశుద్ధి ఉంటే అదానీతో తెలంగాణ సర్కార్ చేసుకున్న ఒప్పందాలు వెంటనే రద్దు చేయించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. మహారాష్ట్ర వెళ్లి అదానీని గజదొంగ అని చెప్పిన రేవంత్.. తెలంగాణలో మాత్రం ఆయనకు గజమాల వేశారంటూ ధ్వజమెత్తారు.

### ఆంధ్రప్రదేశ్ ప్రతిష్ఠ, బ్రాండ్‌ను

## దెబ్బతీసిన వైకాపా పాలన

మెదటిపేజీ తరువాయి

ఎన్నడూ లేనివిధంగా ఎన్నికల్లో ప్రజలు తీర్పు ఇచ్చారని.. రాష్ట్రాన్ని నిలబెట్టే బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందని చెప్పారు. భద్రత లేకుంటే రాష్ట్రంలో పెట్టుబడులకు ఎవరూ ముందుకు రారన్నారు. శాసనసభ లో 'స్వర్ణాంధ్ర-2047' డాక్యుమెంట్‌పై చర్చ సందర్భంగా సీఎం మాట్లాడారు. 'వెల్తీ, హెల్తీ, హ్యాపీ ఆంధ్రప్రదేశ్' నినాదంతో దీన్ని రూపొందించినట్లు పేర్కొన్నారు. 'వైకాపా ప్రభుత్వ అక్రమాలపై లోతుల్లోకి వెళ్లే కొద్దీ ఆశ్చర్యకర విషయాలు తెలుస్తున్నాయి. చరిత్రలో ఏ రాజకీయ నాయకుడూ ఇన్ని తప్పులు చేయరు. వ్యవస్థలు విధ్వంసమయ్యాయి. అధికార యంత్రాంగం మొత్తం నిర్వీర్యమైంది. అప్పులు పరాకాష్ఠకు చేరాయి. తప్పుడు ప్రచారాన్నే ఆధారంగా చేసుకుని పనిచేశారు. వాస్తవాలు చెప్పినా వాటిని పక్కన పెట్టి అసత్యాలను పదేపదే చెప్పి ప్రజలను మభ్యపెట్టాలని చూశారు. ఇది చాలా దురదృష్టకరమైన రాజకీయం. బరితెగించి తప్పులు చేసి వాటిని ఒప్పులుగా చిత్రీకరించారు. ఇలాంటి విచిత్ర పరిస్థితిని నా 40 ఏళ్ల రాజకీయ చరిత్రలో ఎప్పుడూ చూడలేదు. ఎన్నికల్లో ప్రజలు విస్పష్ట తీర్పు ఇచ్చారు. 93 శాతం స్ట్రయిక్ రేటుతో కూటమికి అధికారం కట్టబెట్టారు. 1995లో నేను తొలిసారి సీఎం అయినప్పుడు ఉద్యోగులకు జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితి ఉంది. ప్రజలకు చెప్తే సహకరించారు. అనివార్య పరిస్థితుల్లో అప్పట్లో రూ.2కి అందించే కిలో బియ్యం ధర పెంచాల్సి వచ్చింది. 1999లో విజన్-2020 తీసుకొచ్చాం. నాలెడ్జ్ ఎకానమీకి హైదరాబాద్ చిరునామాగా మారింది. రాష్ట్రానికి పెట్టుబడులు రావాలంటే భద్రత ఉండాలి. ప్రజలు కూడా దీన్ని అర్థం చేసుకోవాలి. వారికి చెప్పాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉంది. ప్రజలను చైతన్యం చేయాలి. 2047 నాటికి దేశానికి స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లు అవుతుంది. ప్రధాని మోదీ వికసిత్ భారత్ పిలుపునిచ్చారు. మనం స్వర్ణాంధ్ర-2047 నినాదంతో ముందుకెళ్లాలి. ఎమ్మెల్యేలపై గురుతర బాధ్యత ఉంది. నియోజకవర్గ పరిధిలోనూ విజన్ డాక్యుమెంట్ తయారు చేయాలి. 2047 నాటికి మీ నియోజకవర్గం ఎలా ఉండాలని కోరుకుంటున్నారో అందులో పొందుపర్చాలి. ప్రజలకు సేవ చేస్తే ఏ నియోజకవర్గమైనా గెలిపిస్తారు'అని చంద్రబాబు అన్నారు. ఇదిలా వుంటే తన అవినీతి ఖ్యాతిని జగన్ విశ్వవిఖ్యాతం చేసుకున్నారని తెదేపా ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి విమర్శించారు. శాసనసభ సమావేశాల్లో ఆయన మాట్లాడారు. రూ.60 వేల కోట్లు దోచుకొని జగన్ ఈడీ కేసుల్లో ఉన్నారన్నారు. 12 ఏళ్లుగా కేసును నడుపుకొంటూ వెళ్తున్నారని చెప్పారు. వాటిని ఎలా పొడిగించాలో తెలిసిన వ్యక్తి జగన్ అని మండిపడ్డారు. అటువంటి వ్యక్తికి రూ.1,750 కోట్లు లంచం తీసుకోవడం ఓ లెక్కా అని ఎద్దేవా చేశారు. విద్యుత్తు కొనుగోలు ఒప్పందాలతో భారీగా దోచుకునేందుకు ప్రణాళిక చేశారని ఆరోపించారు. 'జగన్ దోపిడీతో రాష్ట్రానికి నష్టం జరిగింది. అదానీతో చాలా ఒప్పందాలు చేసుకున్నారు. ఓ తెలుగు వాడు నిర్వహిస్తున్న గంగవరం పోర్టును అక్రమంగా అదానీకి కట్టబెట్టారు. జగన్ అవినీతిని పరాకాష్ఠకు చేర్చారు. ప్రభుత్వ ఖర్చుతోనే తన నివాసానికి ఇనుప బారికేడ్లు పెట్టుకున్నారు.

## ఇన్ఫార్మర్ నెపంతో అన్నదమ్ముల దారుణ హత్య

ప్రజాక్షేత్రం:ములుగు

ములుగు జిల్లా మరోసారి ఉలిక్కిపడింది. ఇన్ ఫార్మర్ల నెపంతో మావోయిస్టులు ఇద్దరు అన్నదమ్ములను దారుణ హత్య చేశారు. వాళ్లిద్దరినీ గొడ్డళ్లతో నరికి చంపడంతో పాటు సీపీఐ మావోయిస్టు పార్టీ వెంకటాపురం వాజేడు ఏరియా కమిటీ కార్యదర్శి శాంత పేరున లేఖ కూడా రిలీజ్ చేశారు. ములుగు జిల్లాలో మావోయిస్టులు రెచ్చిపోయారు. ఇన్‌ఫార్మర్‌ల పేరుతో అన్నదమ్ములను నరికి చంపారు. అన్నదమ్ములు ఇద్దరినీ దారుణంగా హతమార్చడంతో ములుగుజిల్లాలో ఒక్కసారిగా భీకర వాతావరణం నెలకొంది ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. ములుగు జిల్లా వాజేడు మండలంలోని పెనుగోలు కాలనీలో ఉంటున్న ఉయిక రమేశ్ పేరూరు పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తుండేవాడు. అతని తమ్ముడు ఉయిక అర్జున్ స్థానికంగా పశువులను మేపుకుంటూ ఉండేవాడు. కాగా ఉయిక అర్జున్ కొద్దిరోజులుగా ఇన్ ఫార్మర్ గా మారి పోలీసులకు సమాచారం చేరవేస్తున్నట్లు మావోయిస్టులు అనుమానించారు. ఈ మేరకు గురువారం అర్ధరాత్రి కొంతమంది మావోయిస్టులు గ్రామంలోకి చొరబడి ఉయిక రమేష్‌తో పాటు ఉయిక అర్జన్ ను వేట గొడ్డళ్లతో దారుణంగా హత్య చేశారు. దీంతో ములుగు జిల్లాలో కలకలం చెలరేగింది. విషయం తెలుసుకున్న పోలీసు వర్గాల్లో కూడా అలజడి మొదలైంది. అన్నదమ్ములను హత్య చేసిన అనంతరం భారత కమ్యూనిస్ట్ మావోయిస్ట్ పార్టీ వెంకటాపురం వాజేడు ఏరియా కమిటీ కార్యదర్శి శాంత పేరున లేఖ కూడా రిలీజ్ చేశారు. దాని సారాంశం ప్రకారం.. ములుగు జిల్లా వాజేడు మండలం పెనుగోలు గ్రామానికి చెందిన ఉయికె అర్జున్ గ్రామంలో ఉంటూ పోలీస్ ఇన్ ఫార్మర్‌గా మారాడు. అతను వాజేడు మండలంలో ఉంటున్నాడు.అతను శికారు పేరుతో చేపల వేటతో పాటు పశువులను మేపే పేరుతో అడవికి వెళ్లి అంతా తిరిగేవాడు. అక్కడ మావోయిస్టుల దళం మకాంలు, కదలికలు గమనించి స్థానిక పోలీసులకు సమాచారం ఇస్తున్నట్టు మావోయిస్టు పార్టీ నేతలకు అనుమానం కలిగింది. దీంతో పద్ధతి మార్చుకోవాల్సిందిగా చెప్పినా వినడం లేదని పేర్కొంటూ.. అదే కారణంతో ఉయికె అర్జున్ ను ఖతం చేస్తున్నాం అంటూ లేఖలో పేర్కొన్నారు. ఉయికె అర్జున్ ను హత మార్చేందుకు మావోయిస్టులు అతడిని తీసుకెళ్లగా.. అడ్డుకునేందుకు వెళ్లిన అన్న రమేష్‌ను కూడా మావోలు గొడ్డలి వేటుతో హత మార్చారని స్థానికులు చెబుతున్నారు. కాగా ఇద్దరు అన్నదమ్ముల హత్యతో ములుగు జిల్లా మరోసారి ఉలిక్కిపడగా.. పోలీసులు అలర్ట్ అయ్యారు. గ్రామంలో పోలీసులు మోహరించి పరిస్థితిని సమీక్షిస్తున్నారు. స్థానికులు ఎవరూ భయాందోళనకు గురి కావొద్దని సూచిస్తున్నారు.

## భారతీయ సంస్కృతీ సంప్రదాయాలు గొప్పవి

మెదటిపేజీ తరువాయి

సంస్కృతిలో భాగం. ఇది ఇంద్రధనస్సులోని సౌందర్యాన్ని సూచిస్తుంది' అని ద్రౌపదీ ముర్ము అన్నారు. దేశ సంస్కృతి, సంప్రదాయాలను బలోపేతం చేసే గొప్ప కార్యక్రమం అని లోక్ మంథన్ అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం గర్వంగా భావిస్తున్నానని తెలిపారు. భారతదేశ సంస్కృతి, ఆచార వ్యవహారాలు, మన పరంపర చాలా ఘనమైనవి అన్నారు. భిన్నత్వంలో ఏకత్వం గురించి మాట్లాడతాం.. పాటిస్తాం అన్నారు. ఇదే మన బలం, ఇదే మన స్థైర్యం అని తెలిపారు. ఇన్ని భిన్న సంస్కృతులు ఒకేచోట ఉండటం నిజంగా చాలా గొప్ప విషయం అన్నారు. ఇవన్నీ కలిసిన సుందరమైన ఇంద్రధనస్సు లాంటి దేశం మనదన్నారు. వనవాసి, నగరవాసి అని లోకమంథన్ కార్యక్రమంలో.. అహల్యాబాయ్ హోల్కర్, రాణి రుద్రమదేవి, ఝాన్సీ లక్ష్మీబాయి వంటి వీరాంగనల పై ప్రదర్శనలు నిర్వహిస్తున్నారని తెలిసి హర్షం వ్యక్తం చేశారు. వారి ప్రేరణ ఎప్పటికీ మనకు అవసరం అన్నారు. విదేశాల్లో భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను పాటిస్తుండటం అభినందనీయం అన్నారు. ఇండోనేషియా సహా వివిధ దేశాల ప్రతినిధులు ఈ వేదిక ద్వారా తమ సంస్కృతిని ప్రదర్శిస్తుండటాన్ని హృదయపూర్వకంగా అభినందిస్తున్నానని తెలిపారు. భారతదేశ ఆధ్యాత్మిక భావనలు, కళలు, సంగీతలు, విద్య, వైద్య విధానాలు ప్రపంచవ్యాప్తంగా గౌరవాన్ని పొందాయన్నారు. ప్రపంచానికి మనం జ్ఞాన దర్శనం చేశామన్నారు. ప్రపంచమంతా ప్రస్తుత సమయంలో మళ్లీ భారతదేశ జ్ఞానాన్ని పంచాల్సిన అవసరం ఏర్పడింది. విదేశీ శక్తులు శతాబ్దాలుగా మన మీద జులూం ప్రదర్శించాయి. మన సంస్కృతిని, భాషను, సంప్రదాయాలను, ఆచార వ్యవహారాలను విధ్వంసం చేశాయి. మనలో ఐకమత్యాన్ని దెబ్బతీసేలా వ్యవహరించారని తెలిపారు. మనలో బానిస మూలాలను చొప్పించారన్నారు. కానీ మన దేశ ప్రజలు సంస్కృతి, సంప్రదాయాలను పాటిస్తూ.. వీటిని నిరంతరం జీవింపజేశారన్నారు. ఇకపైనా వీటిని కొనసాగించాల్సిన అవసరం ఉందని తెలిపారు. భారతదేశం బానిసత్వ మూలాలను తొలగించుకునే ప్రయత్నం చేస్తోందన్నారు. రాజ్ పథ్ పేరు కర్తవ్యపథ్ మారిందన్నారు. దర్బార్ హాల్ పేరు.. గణతంత్ర మండప్ గా మార్చామన్నారు. ఇది బానిసత్వ ఆలోచనలను తొలగించే దిశగా జరుగుతున్న ప్రయత్నం అన్నారు. మన ఆలోచనలు కూడా మారాలని తెలిపారు. ఇటీవల.. ఓ హైకోర్టులో మహిళా జడ్జి విగ్రహాన్ని ప్రారంభించారన్నారు. కానీ ఆ విగ్రహం కళ్లకు నల్లని గంతల కట్టలేదని, ఇది మనం సాధిస్తున్న మార్పుకు సంకేతం అన్నారు. మన ఆలోచనలు కూడా మారాలని తెలిపారు. అప్పుడే అనుకున్న లక్ష్యాలను సాధించగలమన్నారు. ఐకమత్యం, సమరసతే మన సభ్యత.. మన భవిష్యత్తు అన్నారు. ఈ దిశగా మనమంతా కలిసి పనిచేద్దామన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు. లోక్ మంథన్ కార్యక్రమం అనంతరం బేగంపేట ఎయిర్‌పోర్ట్ నుంచి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తిరుగు ప్రయాణం అయ్యారు. నేటితో రాష్ట్రపతి రెండు రోజుల పర్యటన ముగిసింది.

## ముగిసిన ఏపీ అసెంబ్లీ సమావేశాలు

మెదటిపేజీ తరువాయి

అయ్యన్నపాత్రుడు తెలిపారు. ఈ సమావేశాల్లో 21 బిల్లులు ప్రవేశపెట్టి ఆమోదం తెలిపారని పేర్కొన్నారు. ఈ సమావేశాల్లో 120 మంది సభ్యులు ప్రసంగించారని వివరించారు. సమావేశాల్లో చివరి రోజు మూడు బిల్లులకు ఆమోదం తెలిపింది. వీటిలో విశాఖ డెయిరీ అక్రమాలపై సభాసంఘం వేయాలని నిర్ణయించామని స్పీకర్ వెల్లడించారు. 75 ప్రశ్నలకు మంత్రులు సమాధానం చెప్పారని వివరించారు. ఏపీ కౌన్సిల్ సమావేశాలు సైతం శుక్రవారంతో ముగిసాయి. ఇదిలావుంటే ఇప్పటికే శాసనసభలో ఆమోదం పొందిన 8 కీలక బిల్లులకు శుక్రవారం శాసనమండలి ఆమోదం తెలిపింది. విజయనగరం జిల్లాలోని భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి అల్లూరి సీతారామరాజు పేరు పెట్టాలని కేంద్ర పౌరవిమానయాన శాఖను కోరుతూ మండలి తీర్మానం చేసింది. చెత్తపన్ను విధిస్తూ గత ప్రభుత్వం చేసిన చట్టాన్ని శాసనమండలి రద్దు చేసింది. లోకాయుక్త సవరణ బిల్లు 2024కు శాసనమండలి ఆమోదం తెలిపింది. గూడ్స్ అండ్ సర్వీసెస్ సవరణ బిల్లు 2024కు శాసన మండలి ఆమోదం తెలిపింది. ఏపీలో సహజవాయు వినియోగంపై జీఎస్టీ పన్నును తగ్గిస్తూ జీఎస్టీ సవరణ బిల్లుకు మండలి ఆమోదం లభించింది. ఏపీ హిందూ ధార్మిక, మత సంస్థలు దేవాదాయ చట్ట సవరణ బిల్లుకు శాసన మండలి ఆమోదం ఇచ్చింది. ఏపీ మౌలిక సదుపాయాలు న్యాయపరమైన పారదర్శకత జ్యుడిషియల్ ప్రివ్యూ రద్దు బిల్లుకు ఆమోదం తెలిపింది. ఏపీ ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్ 2024 రద్దుకు శాసనమండలి ఆమోదం తెలిపింది. పీడీ యాక్ట్ సవరణ బిల్లు 2024కు ఆమోదం తెలిపింది. కీలక బిల్లులకు ఆమోదం తెలిపిన అనంతరం శాసనమండలి నిరవధిక వాయిదా పడింది.

## ఆదానీతో ఒప్పందాలు రద్దు చేసుకోవాలి

మెదటిపేజీ తరువాయి

ప్రెసిడెంట్ కేటీ ఆర్ ఆరోపించారు. అదానీ విషయంలో కాంగ్రెస్ పార్టీ నేతలంతా రెండు నాలుకల ధోరణితో ఉన్నారని కేటీఆర్ మండిపడ్డారు. అదానీతో తెలంగాణ సర్కార్ చేసుకున్న ఒప్పందాలను వెంటనే రద్దు చేయాలని మాజీ మంత్రి డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డిపై కేటీఆర్ విమర్శలు గుప్పించారు. అదానీతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందాలపై తెలంగాణ బీజేపీ వైఖరి ఏంటో చెప్పాలి. అదానీ వ్యవహారంతో కాంగ్రెస్, బీజేపీ ఒక్కటేనని మరోసారి రుజువైంది.అదానీతో దేశానికి నష్టమైతే తెలంగాణకు నష్టం కాదా. దీనిపై రాహుల్ గాంధీ జవాబు చెప్పాలన్నారు. అదానీ అవినీతిపరుడైతే సీఎం రేవంత్ రెడ్డి నీతిపరుడు ఎలా అవుతాడో రాహుల్ గాంధీ చెప్పాలని అన్నారు. రాహుల్ గాంధీకి చిత్తశుద్ధి ఉంటే అదానీతో తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలు రద్దు చేయించాలి. కెన్యా లాంటి చిన్న దేశాలే రద్దు చేసుకున్నప్పుడు రేవంత్ ఎందుకు రద్దు చేసుకోరు. అదానీతో ఒప్పందాలపై పునరాలోచన చేయాలని ఏపీసీసీ చీఫ్ షర్మిలారెడ్డి సైతం అన్నారు. ఈ అంశంలో షర్మిల సూచనలను ముఖ్యమంత్రి తీసుకోవాలి. మహారాష్ట్ర వెళ్లి అదానీని గజదొంగ అన్న రేవంత్.. తెలంగాణలో మాత్రం గజమాల వేస్తున్నారు. స్కిల్ యూనివర్శిటీకి రూ.100 కోట్లు తీసుకోవడం తప్పా.. కాదా. కోహినూరు హోటల్లో మంత్రి పొంగులేటి, అదానీ రహస్య సమావేశమైన మాట వాస్తవం. ఆయనతో రేవంత్ సర్కార్ రద్దు ఒప్పందాలు చేసుకోవటం లేదు అదానీ వేల కోట్ల రూపాయల ఒప్పందాలపై రోజూ విమర్శించే రాహుల్ దీనికి సమాధానం చెప్పాలి. రాహుల్‌కి తెలిసే రేవంత్ రెడ్డి విరాళం తీసుకున్నారా?. జాతీయ పార్టీకి ఢిల్లీలో ఒక నీతి ఉంటే గల్లీలో మరొక నీతి ఉంది. బీజేపీ డబుల్ ఇంజిన్ సర్కార్ అయితే కాంగ్రెస్ డబుల్ స్టాండర్డ్ పార్టీనా.అని ప్రశ్నలు కురిించారు. కేసీఆర్ హయాంలో ఎంత ప్రయత్నం చేసినా తెలంగాణలో అదానీకి అవకాశం ఇవ్వలేదు. ఆయనతో మేము ఫొటోలు దిగిన మాట వాస్తవం. అంతే మర్యాదగా బయటకు పంపించాం. రేవంత్ మాత్రం అదానీకి ఎర్ర తివాచీ పరచి స్వాగతం పలికారు. అదానీతో చేసుకున్న రూ.12,400 కోట్ల ఒప్పందాలను వెంటనే రద్దు చేసుకోవాలి. బడే బాయ్ మోదీ ఆదేశాలను చోటా బాయ్ రేవంత్ అమలు చేశారు. తెలంగాణలో అదానీ వ్యాపార సామ్రాజ్య ఏర్పాటుకు ముఖ్యమంత్రి సహకారం అందిస్తున్నారు. అదానీ వ్యవహారంతో భారతదేశ ప్రతిష్ఠ మసకబారింది. ఈ వ్యవహారంపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేయాలి. రామన్నపేటలో అదానీ సిమెంట్ పరిశ్రమ వద్దని ఆందోళన చేసినా రేవంత్ పట్టించుకోలేదని అంటూ ధ్వజమెత్తారు.

## అనర్హతపై స్పీకర్‌దే తుది నిర్ణయం

మెదటిపేజీ తరువాయి

ఉత్తర్వులను సీజే ధర్మాసనం కొట్టేసింది. తగిన సమయంలో నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌కు సూచించింది. నిర్ణయం తీసుకునే అధికారం స్పీకర్‌దేనని కూడా స్పష్టం చేసింది. 10వ షెడ్యూల్ ప్రకారం అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకోవాలంది. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం, ఐదేళ్ల అసెంబ్లీ గడువును దృష్టిలో ఉంచుకొని స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని సూచించింది. భారాస తరపున ఎమ్మెల్యేలుగా గెలిచిన కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావు, దానం నాగేందర్ కాంగ్రెస్‌లో చేరడంతో వారిపై అనర్హత వేటు వేయాలంటూ భారాస ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, కె.పి. వివేకానంద్‌లు పిటిషన్లు దాఖలు చేశారు. వీటితోపాటు దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయాలంటూ భాజపా శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మరో పిటిషన్ దాఖలు చేశారు. అనర్హత పిటిషన్‌లను స్పీకర్ స్వీకరించకపోవడంతో వారు హైకోర్టును ఆశ్రయించారు. సెప్టెంబరు 9న దీన్ని విచారించిన సింగిల్ జడ్జి.. 4 వారాల్లో అనర్హత పిటిషన్‌లపై షెడ్యూలు ఖరారు చేయాలని తీర్పు వెలువరించారు. సింగిల్ జడ్జి తీర్పును సవాలు చేస్తూ హైకోర్టులో అసెంబ్లీ కార్యదర్శి వి. నరసింహాచార్యులు దాఖలు చేసిన అప్పీళ్లపై ఇటీవల వాదనలు ముగియగా తీర్పును వాయిదా వేసింది. తాజాగా స్పీకర్ తీసుకోవాలంటూ శుక్రవారం ఉన్నత న్యాయ స్థానం తీర్పును వెలువరించింది. దీంతో జంపింగ్ జంపాగ్‌లకు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. పారటీ మారిన ఎమ్మెల్యేలపై స్పీకర్ చర్యలు తీసుకునేలా అదేశాలు ఇవ్వాలని కోరుతూ బీఆర్ఎస్ నేతలు పిటిషన్ వేశారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై 4 వారాల్లోగా టైం ఫ్రెమ్ ఫిక్స్ చేయాలని అసెంబ్లీ స్పీకర్ గడ్డం వినోద్ కుమార్‌కు సింగిల్ బెంచ్ ఆదేశించింది. సింగిల్ బెంచ్ ఆదేశాలను సవాలు చేస్తూ హైకోర్టు డివిజన్ బెంచ్ లో అసెంబ్లీ కార్యదర్శి అప్పీల్ చేశారు. అసెంబ్లీ కార్యదర్శి రిట్ అప్పీల్‌పై హైకోర్టు తీర్పు ప్రకటించింది. స్పీకర్ తుది నిర్ణయం తీసుకోవాలని హై కోర్టు డివిజన్ బెంజ్ స్పష్టం చేసింది. స్పీకర్‌కు ఏలాంటి నిర్దుష్ట సమయం అంటూ లేదని హైకోర్టు తేల్చిచెప్పింది. తగిన స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు ఆదేశించింది. సింగిల్ బెంచ్ తీర్పును హైకోర్టు కొట్టే వేసింది. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై 10వ షెడ్యూల్ ప్రకారం నిర్ణయం తీసుకోవాలని చెప్పింది. తగిన సమయంలో నిర్ణయం తీసుకోవాలని అసెంబ్లీ స్పీకర్‌కు సీజే ధర్మాసనం సూచించింది.

## చెరువుల ఆక్రమణలపై హైడ్రా దృష్టి

మెదటిపేజీ తరువాయి

మొదటి కమిషనర్‌గా ఉండటం సంతోషంగా ఉంది.దేశంలోనే మొదటి సారి హైడ్రా తీసుకొచ్చారు. కేవలం జీహెచ్‌ఎంసీలో మాత్రమే కాకుండా చుట్టుపక్కల ఉన్న మరో 27 మునిసిపాలిటీల పరిధిలో హైడ్రా పని చేస్తుంది.. వాటర్ బాడీస్, గవర్నమెంట్ ల్యాండ్స్, పబ్లిక్ అసెట్స్, లేక్స్ ఆక్రమణలకు గురవుతున్నాయి.. వాటికోసం హైడ్రా పనిచేస్తుంది. హైదరాబాద్ అంటేనే గొలుసు కట్టు చెరువులు.. ఒక చెరువుకు మరో చెరువుకు కనెక్టివిటీ ఉండేది..ఇప్పుడు కనెక్టివిటీ లేదు. నాలాలు కూడా సరిగా లేవు. గట్టి వర్షం పడితే ముంపుకు గురవుతాయి..దివి సీమ ఉప్పెన వచ్చినప్పుడు 10 వేల మంది చనిపోయారు. పేదరికం వల్ల చాలామంది ముందస్తు సమాచారం లేకపోవడం వల్ల ప్రాణాలు కోల్పోయారు.'ఐఎండీ వల్ల ముందే ఊహించగలుగుతున్నారు.. డిజాస్టర్స్‌లో కూడా మార్పులు వస్తున్నాయి.. దేశంలో అర్బనైజేషన్ పెరుగుతుంది.తెలంగాణలో అర్బనైజేషన్ పెరుగుతుంది. వెహికిల్ పాపులేషన్ 80 లక్షలుగా ఉంది. సిటీ ట్రాఫిక్ అడిషినల్ సీపీగా కూడా ఉన్నాను. 2, 3 సెంటిమీటర్ల వర్షం పడితే మూడు, నాలు గు గంటలు ట్రాఫిక్ జామ్ అవుతుంది. మెట్రో సిటీలలో వాతావరణ మార్పులు ఎక్కువగా ఉన్నాయి. క్లౌడ్ బరస్ట్ కూడా పెరుగుతున్నాయి. నాలాలు, చెరువులు ఆక్రమణలకు గురయ్యాయి.. వర్షం పడినప్పుడు వరద నీరు ఇంకడానికి చాలా సమయం పడుతుంది. సాయంత్రం 4, 5 గంటలకు వర్షం పడితే భారీగా వరద నీరు వచ్చి చేరుతుంది.. ఆ నీరు ఇంకడానికి మార్గాలు లేవు.. సిటీలో 150 వాటర్ లాగింగ్స్ ఉన్నాయి. అర్బన్ డిజాస్టర్‌ల మీద ఫోకస్ పెట్టాలి.157 ఏడబ్ల్యూఎస్ స్టేషన్స్ ఉన్నాయి.. ఇంకా కావాలి. ప్రతి 15నిమిషాలకు బెంగుళూరులో ఏడబ్ల్యూఎస్ స్టేషన్‌ల నుంచి డేటా కలెక్ట్ చేస్తారు.. మనం కూడా దీనికి మారాలి. సిటీ లో వెదర్ రెడర్స్ కావాలి..జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ వంటి హిల్ ఏరియాల్లో పెట్టాల్సిన అవసరం ఉంది. వెదర్ అలర్ట్స్ స్పెసిఫిక్‌గా ఉండాలి. ఇక్కడ వర్షం పడుతుందని కాకుండా ఇక్కడ పడదని చెప్పేలా వెదర్ అలర్ట్స్ ఉండాలి. వర్షాలు పడుతున్నపుడు గంటల తరబడి ట్రాఫిక్‌లో ఇరుక్కుపోవడం వల్ల ఎకనామికల్ లాస్ కూడా ఏర్పడుతుంది..హైడ్రా, ఐఎండీతో కలిసి పనిచేస్తుంది. అర్బన్ డిజాస్టర్స్ కో సంబంధించి ఐఎండీతో కలిసి పనిచేస్తుంది. నేను మెకానికల్ ఇంజనీర్‌ని, అయినా వీటి గురించి తెలుసుకోవడానికి ప్రయత్నం చేస్తున్నాను. ప్రజలు వెదర్ అలర్ట్స్‌ని సీరియస్‌గా తీసుకునేలా హైడ్రా పని చేస్తుందని హైడ్రా కమిషనర్ రంగనాథ్ వెల్లడించారు.

## సన్నాలకు 500 బోనస్ విడుదల

మెదటిపేజీ తరువాయి

పెరగడంతో దిగుబడిలోనూ సన్న ధాన్యం రికార్డులు సృష్టిస్తోంది. ఈ యేడు సన్న వడ్ల దిగుబడి దాదాపు 93.33 లక్షల టన్నులు ఉంటుందని సర్కారు అంచనా వేసింది. దీంతో రాష్ట్రంలో ఇప్పుడు ఏ మిల్లు చూసినా, ఏ కొనుగోలు సెంటర్ చూసినా సన్న వడ్ల రాసులే కనిపిస్తున్నాయి. సన్న వడ్ల కొనుగోలు కోసం ప్రభుత్వం 7,500 సెంటర్లు ఏర్పాటు చేసింది సర్కార్. కనీస మద్దతు ధరతో పాటు అదనంగా బోనస్ ఇస్తోంది ప్రభుత్వం. ఖాతాల్లో ధాన్యం సొమ్ముతో పాటు బోనస్ కూడా జమ అవుతుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇవాళ పలువురు రైతులకు సన్నాల బోనస్ మెస్సేజ్‌లు వచ్చాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లా కోరుట్లకు చెందిన ఓ రైతు 46 క్వింటాళ్ల 800 గ్రాముల ధాన్యం విక్రయించగా.. 23,400 రూపాయల బోనస్ మొత్తం తెలంగాణ గ్రామీణ బ్యాంకు లోని ఆయన ఖాతాలో జమైనట్లు మెస్సేజ్ వచ్చింది. బాదావత్ నరేశ్, హాతియా తండా, కూసుమంచి మండలం, ఖమ్మం జిల్లా నామూడెకరాల్లో పండిన వడ్లను పాలేరు ఐకేపీ సెంటర్ లో మూడు రోజుల కిందట కాంటా వేశారు. 59 క్వింటాళ్ల 20 కేజీలు అయ్యాయి. వాటికి సంబంధించిన డబ్బులు లక్షా 37 వేల 344 రూపాయలు వచ్చాయి. కనీస మద్దతు ధర 2,320 చొప్పున కొనుగోలు చేశారు. ఈ డబ్బులను నా ఖాతాలో ప్రభుత్వం వేసింది. వడ్లకు సంబంధించిన బోనస్ కూడా నిన్న సాయంత్రం మా ఖాతాల్లో వేసింది. నాకు 29,600 బోనస్ సొమ్ము వచ్చాయి..

## సమర్థంగా కేంద్ర ప్రభుత్వ పథకాల వినియోగం

మెదటిపేజీ తరువాయి

రాష్ట్రంలో అమలు చేయడం ద్వారా పేదరిక నిర్మూలన, ఉపాధి అవకాశాల పెంపు, గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి లక్ష్యాలను సాధించవచ్చని తెలిపారు. కేంద్ర పథకాల అమలుకు సంబంధించి తన ఎంపీ అనుభవాలను సభ్యులతో పంచుకుంటూ, వాటిని ఎఫెక్టివ్‌గా అమలు చేయడంపై దృష్టి సారించాలని సూచించారు .కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ప్రతీ జిల్లాలో దిశ కమిటీలను ఏర్పాటు చేసి, అభివృద్ధి కార్యక్రమాల పర్యవేక్షణకు అవసరమైన సమన్వయం అందిస్తోందని మంత్రి తెలిపారు. తుమ్మల నాగేశ్వర్ రావుతో కలిసి నల్లగొండ జిల్లాలో అమలవుతున్న పథకాలపై సమీక్ష నిర్వహించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యేలు నేనావత్ బాలు నాయక్, వేముల వీరేశం, మందుల సామేల్, బత్తుల లక్ష్మారెడ్డి, కుందూరు జయవీర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ విధానాలపై 26న కార్మిక ప్రదర్శనలో పాల్గొనండి

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్ పిలుపు

**విశాఖపట్నం, నవంబర్ 22(ప్రజాక్షేత్రం):**

కేంద్ర ప్రభుత్వనుసరిస్తున్న కార్మిక రైతు వ్యతిరేక విధానాలపై ఈనెల 26న దేశవ్యాప్తంగా జరుగుతున్న నిరసన ప్రదర్శనలలో కార్మిక వర్గం, రైతాంగం పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ కె ఎస్ వి కుమార్ పిలుపునిచ్చారు. గురువారం మద్దిలపాలెం ఆటోమోటివ్ వద్ద ముఠా కళాసిల జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కుమార్ పాల్గొని మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చి కార్మిక రైతు వ్యతిరేక విధానాలను దూకుడుగా అమలు చేస్తుందని, మన రాష్ట్రంలో టిడిపి జనసేన బిజెపి కూటమి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ విధానాలకు మద్దత్తు తెలియాజేయడం వలన కార్మిక వర్గానికి, రైతాంగానికి నష్టదాయకమన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ను కాపాడుతామన్న టిడిపి జనసేన కూటమి ప్రభుత్వం కాంట్రాక్ట్ కార్మికులను అక్రమంగా తొలగిస్తున్నా, పర్మినెంట్ కార్మికులను విఆర్ఎస్ పేరుతో బయటకి నెట్టేస్తున్నా కూటమి ప్రభుత్వం శోధ్యం చూస్తుందన్నారు. ప్లాంట్ కు సొంత గనులు కేటాయించకపోతే దానిని సెయిల్ లో విలీనం చేయాలన్న ప్రజల డిమాండ్ ను మోడీ దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. ప్లాంట్ భూములను ఆదానికి కట్టబెట్టే చర్యలు ఆపాలన్నారు. కార్మికులకు నష్టదాయకమైన లేబర్ కోడ్స్ రద్దు చేసి,. కనీస వేతనం 26 వేల రూపాయలు చెల్లించి, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, గత సమ్మె కాలపు డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ముఠావర్కర్ సీనియర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం సుబ్బారావు మాట్లాడుతూ ముఠా కార్మికులకు ఈ ఎస్ ఎఫ్ ఈ ఎఫ్ తో కూడిన సమగ్ర చట్టం చేయాలని 20 ఏళ్లుగా పోరాడుతున్న టిడిపి, వైఎస్ఆర్సిపి, బిజెపి ప్రభుత్వాలు పెడచెవిన పెట్టాయి అన్నారు. ముఠా కార్మికుడు ప్రమాదంలో చనిపోతే షావుకారులు గాని ప్రభుత్వం గాని ఒక రూపాయి కూడా ఇవ్వడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. వీరు 60 ఏళ్ళు దాటిన తర్వాత మోకాళ్ళ నొప్పులు భుజం నొప్పి, ఇతర అనారోగ్య సమస్యలతో మంచాన పడుతున్నారని అన్నారు. వీరికి కనీసం రిటైర్మెంట్ బెనిఫిట్స్ కూడా ఏమీ ఉండవు



అన్నారు. ఆటో ముఠా భవనిర్మాణ, చిరు వ్యాపారస్తులు, రవాణా రంగ కార్మికులకు ఉపాధి రక్షణ కల్పిస్తూ ఈఎస్ఐ పిఎఫ్ తో కూడిన సమగ్ర చట్టం, ప్రమాద భీమా, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ప్రభుత్వం కల్పించాలని డిమాండ్ చేశారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని, వ్యవసాయ కార్మికులకు, కౌలు రైతులకు ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలని, కూటమి ప్రభుత్వం రైతులకు ఇస్తామన్న ఏడాదికి 20 వేల రూపాయలను చేయాలన్నారు. అధిక ధరలు నియంత్రించాలని, పెంచిన విద్యుత్ చార్జీలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలపై 26న విశాఖపట్నం రైల్వే డిఆర్ఎం ఆఫీస్ నుండి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు ప్రదర్శన జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్మికులు, ప్రజలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.సిఐటియు మద్దిలపాలెం జోన్ కార్యదర్శి పి వెంకటరావు, జిల్లా కమిటీ సభ్యులు కృష్ణా రావు, మేస్త్రిలు రమణ, శ్రీను, రెడ్డి, నరసింహా, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## స్వర్గీయ గుడివాడ గుర్నాథ రావు వర్ధంతి సందర్భంగా వారికి ఇవే మా ఘన నివాళులు



**కూర్మన్నపాలెం, నవంబర్ 22 (ప్రజాక్షేత్రం):**

జీవీఎంసీ 87 వార్డు వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకుల ఆధ్వర్యంలో స్వర్గీయ మాజీ మంత్రివర్యులు గుడివాడ గురునాథరావు 23వ వర్ధంతి సందర్భంగా మింది గ్రామంలో జిల్లా పరిషత్ హైస్కూల్ వద్ద గల గురునాథరావు విగ్రహానికి పూలమాలవేసి మాజీ మంత్రివర్యులు గుడివాడ అమర్నాథ్‌తో కలిసి ఘన నివాళులర్పించడం జరిగింది ఈ సందర్భంగా సీనియర్ నాయకులు అయినటువంటి ప్రగాఢ వేణుబాబు మాట్లాడుతూ స్వర్గీయ గుడివాడ గుర్నాథ్ రావు మంత్రివర్యులుగా పని చేసేటప్పుడు మా వడ్లపూడి రెహాబిటేషన్ కాలనీలో డ్రైన్లు రోడ్లు సామాజిక భవనాలు మరియు ప్రజలకు అందుబాటులో ఉండి పనులు నిర్వహించారని నిర్వాసితుల కాలనీలకు గ్రూప్ రూపు రేఖలు మార్చారని ఆయన చేసిన సేవలను కొనియాడారు ఈ కార్యక్రమంలో ప్రగడ వేణుబాబు, చిత్రాడ వెంకటరమణ, ముద్దపు దామోదర్, దుగ్గపు దానప్పలు, ప్రగడ శంకర్రావు , బోండా గోవింద రాజులు, ఎస్ ఈశ్వరరావు, దాసరి అప్పుడు తదితరులు పాల్గొన్నారు

## మానవసేవయే మాధవ సేవ డాక్టర్ సిద్ధం ఉజ్వల్ రెడ్డి

- కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు




**సంగారెడ్డి జిల్లా నవంబర్ 22 (ప్రజాక్షేత్రం)**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం లోని జహీరాబాద్ పట్టణం లో గడి మహెల నిరుపేద కుటుంబానికీ చెందిన తహేరా బేగం కంటి సమస్యతో బాధపడుతుంది.ఈవిషయాన్ని మాడ్గి హర్షద్ పటేల్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డా??సిద్ధం.ఉజ్వల్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి రాష్ట్ర సెట్విన్ చైర్మన్ యన్.గిరిధర్ రెడ్డి సహాయంతో మహిళకు హైదరాబాద్ లోని గ్లోబల్ హాస్పిటల్ లో కంటి ఆపరేషన్ చేయించారు.దీంతో వారి కుటుంబ సభ్యులు అడగ్గానే సహాయం అందించిన సెట్విన్ చైర్మన్ యన్.గిరిధర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డా??సిద్ధం.ఉజ్వల్ రెడ్డి కీ పూలమాలలు, శాలువా తో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.వారు మాట్లాడుతూ ఇలాంటి గొప్ప వ్యక్తులు సమాజానికి అవసరం అని కొనియాడారు. ఈకార్యక్రమంలో జహీరాబాద్ నియోజకవర్గ ,ఆయా మండలాల నాయకులు, యూత్ కాంగ్రెస్ యన్.యస్.యూఐ నాయకులు, తహేరా బేగం కుటుంబ సభ్యులు ఉన్నారు.తదితరులు పాలొగొన్నారు

## సైనికుల కుటుంబాల సంక్షేమానికి జిల్లా సైనిక్ బోర్డ్ నిరంతరం కృషి చేయాలి

- జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్





**విశాఖపట్నం నవంబర్ 22(ప్రజాక్షేత్రం):**

సైనికుల కుటుంబాల సంక్షేమానికి జిల్లా సైనిక్ బోర్డ్ నిరంతరం కృషి చేయాలని జిల్లా కలెక్టర్ మరియు చైర్మన్, జిల్లా సైనిక బోర్డు ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అన్నారు. శుక్రవారం ఉదయం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ మరియు చైర్మన్ అధ్యక్షతన జిల్లా సైనిక్ బోర్డ్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యుద్ధ వితంతువులు/యుద్ధంలో అంగవైకల్యం పొందిన సైనికులకు ఇళ్ల స్థలాలు మంజూరు, ఇంటిగ్రేటెడ్ సైనిక్ భవన్ భూమి కేటాయింపు, Gallantry అవార్డు విన్నర్స్ వారికి ఎక్స్గ్రేషియా మంజూరుకు చర్యలు తీసుకోవాలని జిల్లా సైనిక సంక్షేమ అధికారిని ఆదేశించారు. అదే విధంగా జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయం నందు వాచ్మెన్ పోస్ట్ భర్తీ తదితర అంశాలను సమీక్షించి అధికారులకు తగిన సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర అశోక్, జిల్లా రెవిన్యూ అధికారి బిహెచ్ భవాని శంకర్, లెఫ్టినెంట్ కల్నల్ ఎస్.ఎం. భాష, జిల్లా సైనిక సంక్షేమ అధికారి జి. సత్యానందం, మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## హమాలీ బిడ్డకు నాలుగు గవర్నమెంట్ ఉద్యోగాలు

**దమ్మపేట నవంబర్ 22 (ప్రజాక్షేత్రం):**



మండల కేంద్రంలో జీ సీ సీ లో హమాలీగా పనిచేస్తున్న బోగి సత్యం, అంగన్వాడీ కార్యకర్త బోగి రమణ దంపతుల పెద్ద కుమార్తె సమ్మక్క కు 3 ప్రభుత్వ ఉద్యోగాలు దాసోహం అయ్యాయి.ముందుగా సివిల్ కానిస్టేబుల్ ఉద్యోగం, గ్రూప్ 4 లో జూనియర్ అసిస్టెంట్ జీ సీ సీ లో, ఇప్పుడు జూనియర్ లెక్చరర్ (గెజిటెడ్) ఉద్యోగం సాధించి తల్లిదండ్రులకు ఆనందాన్ని అందించింది. సివిల్స్ సాధించడమే తన లక్ష్యం గా ముందుకు సాగాలని సమ్మక్క తెలిపారు.

## రన్ ఫర్ అంబేద్కర్ 24 న విశాఖలో పదో సారి నిర్వహణ

- భీమ్ సేన అధ్యక్షుడు రవి సిద్ధార్థ

**రేసపువాని పాలెం, నవంబర్ 22(ప్రజాక్షేత్రం):**

నగరంలోని రేసపువాని పాలెంలో గల డాక్టర్ అంబేద్కర్ భవన్, నందు భీమ్ సేన ఆద్వర్యంలో శుక్రవారం మీడియా సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా భీమ్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.రవి సిద్ధార్థ మాట్లాడారు. డాక్టర్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని నవంబర్ 26, 1949 వ సంవత్సరంలో నాటి రాజ్యాంగ పరిషతకు అందజేసిన రోజున (నవంబర్ 26) దేశం "రాజ్యాంగ దినోత్సవం" జరుపుతుందని, అన్నారు.భీమ్ సేన వైజాగ్ ఆద్వర్యంలో 2015 నుంచి వైజాగ్ బీచ్ రోడ్‌లోరన్ ఫర్ అమ్ బేద్కర్ అనే కార్యక్రమాన్ని, నిర్వహిస్తున్నామని గుర్తు చేశారు. ఈ ఏడాది 10వ రన్ ఫర్ అంబేద్కర్ కార్యక్రమం ఈనెల 24 తేదీ న ఆదివారం ఆర్ కే బీచ్ రోడ్ కాళి మాత గుడి నుండి కిర్లం పూడి బీచ్ రోడ్ వైఎంసిఎ వద్దగల పెరియార్ విగ్రహం వరకు జరుగుతుందని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జీ వీ ఎం సీ కమీషనర్ సంపత్ కుమార్ హాజరవుతున్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విశాఖ ప్రజలు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. పూర్వం దళితులకు మానవ హక్కుల నేవి లేవు అన్నారు. నవాబు, బ్రిటిష్ పాలనలో చదువుకునే హక్కు కూడా లేదు. ఎస్సీ, ఎస్టీ బీసీ ప్రజలు అణిచివేతకు గురవుతున్నారు.




అంబేద్కర్ ప్రజలు , మహిళలు పడుతున్న కష్టాలు చూసి, ప్రపంచంలోనే అతి పెద్ద రాజ్యాంగం రూపొందించారు అని గుర్తు చేశారు. రాజ్యాంగం ఆర్టికల్ 14 ప్రకారం సమాన హక్కులు కల్పించారు. అన్ని ఆర్టికల్స్ ప్రజలకు మేలు చేసేవిగా వున్నాయి. అన్ని పాఠశాలల్లో వ్యాస రచన పోటీలు జరపాలని కేంద్రం ఆదేశాలు జారీ చేసింది అన్నారు. రాజ్యాంగం గురుంచి ప్రజలు తెలుసుకోవాలి అని లక్ష్యంతో ప్రభుత్వం ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు అని తెలిపారు. ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. న్యాయ సూత్రాల, చట్టాలు మీద అవగాహన ఉండాలి అని స్పష్టం చేశారు. దేశంలో ఇంకా ఎస్సీ ఎస్టీల మీద అత్యాచారాలు జరగడం పట్ల విచారం వ్యక్తం చేశా రు. మీడియా సమావేశంలో భీమ్ సేన నాయకులు శ్రీకాంత్ , జ్ఞాన శివ కుమార్, రవితేజ, రావణ్, గణేశ్, తది తరులు పాల్గొన్నారు.

## హెడ్ క్వార్టర్ అశ్వరావుపేటలో 108 వాహనం ఏర్పాటు చేయాలి

- గర్భిణీ స్త్రీలు మరియు ప్రమాద బాధితులు అందుబాటులో లేని 108 వాహనం
- ఇతర మండలాల నుంచి 108 వాహనం వచ్చేసరికి గాల్లో కలుస్తున్న ప్రాణాలు

**అశ్వారావుపేట నవంబర్ 22 (ప్రజాక్షేత్రం):**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట నియోజకవర్గ హెడ్ క్వార్టర్ అశ్వరావుపేటలో అత్యవసర పరిస్థితిలో ఉపయోగపడే 108 వాహనం అందుబాటులో లేకపోవడం చాలా దుర దృష్కరం అని,మండల వ్యాప్తంగా మారుమూల ఏజెన్సీ గ్రామాల నుంచి వైద్యం కోసం అశ్వరావుపేట రావాల్సి ఉంటుంది,గర్భిణీ



స్త్రీలకు మరియు ప్రమాద బాధితులకు ఈ మండలంలో 108 వాహనం అందుబాటులో లేకపోవడం వల్ల ఏదైనా అత్యవసరం అయినప్పుడు దమ్మపేట లేదా అన్నపురెడ్డిపల్లి నుంచి 108 వాహనం రావాల్సి ఉంటుంది,ఇతర మండలాల నుంచి 108 వచ్చేసరికి చాలా టైం పడుతున్నది,ఈలోపు ప్రథమ చికిత్స అందక చాలా మంది ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నవి,స్థానిక ఎమ్మెల్యే గారు స్పందించి అశ్వరావుపేట మండలానికి ప్రత్యేకంగా ఒక 108 వాహనం ఏర్పాటు చేయాలని ఆదివాసీ నాయకులు తంబల్ల రవి డిమాండ్ చేశారు,ఈ కార్యక్రమంలో కారం నాగేంద్ర బాబు,తోట రాజా పాల్గొన్నారు.

## సిరి వినాయక ఆలయ తిరువీధి మహెూత్సవంలో పాల్గొన్న డాక్టర్ కందుల కుటుంబం

**అల్లిపురం , నేరేళ్ళ కోనేరు వీధిలో, నవంబర్ 22 (ప్రజాక్షేత్రం):**

శ్రీ సిరి వినాయక ఆలయం 22వ వార్షిక మహెూత్సవములు సందర్భంగా ఆలయ అభివృద్ధి సంఘం శుక్రవారం స్వామి వారి తిరువీధి మహెూత్సవాలు నిర్వహించారు.విశాఖ దక్షిణ నియోజకవర్గ జనసేన నాయకులు, 32వవార్డు కార్పొరేటర్ డాక్టర్ కందుల నగరాజు కుటుంబం ఈ ఊరేగింపు సేవలో పాల్గొంది. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి ఆశీస్సులు తీసుకున్నారు.అనంతరం డాక్టర్ కందుల నాగరాజు మాట్లాడుతూ స్వామి వారి 22వ మహెూత్సవాలు సందర్భంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో పాల్గోనడం తమకంతో సంతోషంగా ఉందన్నారు.22 నుంచి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ కార్యక్రమాలు ఈ నెల 25 వరకు కొనసాగుతాయన్నారు. 23న సహస్రనామ కుంకుమార్చన, సహస్ర దీపారాధన ఉంటుందని అన్నారు.24న పూజాది కార్యక్రమాలు, ప్రసాద వితరణ నిర్విరామంగా సాగుతుందని చెప్పారు.25న స్వామివారి ఆలయం వద్ద మహా అన్నదాన సమారాధన



ఉంటుందన్నారు.గత 21 సంవత్సరాలు ఆలయ నిర్మాణదాతలు, భక్తుల సహాయ సహకారాలతో ఎంతో ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు.ఈ 22వ వార్షిక మహెూత్సవాలలో కూడా భక్తులు పాల్గొని స్వామి వారి ఆశీస్సులు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి సంఘం అధ్యక్షులు రమేష్, పలువురు కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వైద్య ఖర్చులకు 'వాసుపల్లి' రూ.5వేల సాయం



**విశాఖ, దక్షిణం నవంబర్ 22(ప్రజాక్షేత్రం):**

ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటున్న విశాఖ దక్షిణ వైసీపీ ఇన్‌చార్జి, వాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ శుక్రవారం మరో సాయానికి ముందుకొచ్చారు. జీవీఎంసీ 37వ వార్డు జాలరి పేట కు చెందిన బుంగ ముత్యాలమ్మ అనారోగ్యంతో బాధ పడుతున్నారు. ఆమె వైద్య ఖర్చులకు సంబంధించి వాసుపల్లి రూ.5,000 వేల ఆర్థిక సాయం అందజేసి ఆదుకున్నారు. ఆశీలుమెట్ట కార్యాలయంలో ఈ మేరకు బాధితురాలకు నగదు అందజేసి భరోసా ఇచ్చారు. ఆర్థిక ఇబ్బందులతో కుటుంబ పోషణ కష్టంగా ఉన్న తరుణంలో అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్న విషయం వాసుపల్లి గణేష్ కుమార్ దృష్టికి రావడంతో సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో 27 వార్డు అధ్యక్షులు సర్వేశ్వర్ రెడ్డి, నీలం వేప చెట్టు మాజీ చైర్మన్ బొరా విజయలక్ష్మి , బోరా శ్రీనివాసరావు , గనగల్ల రామరాజు , చింతకాయల వాసు, ఆకుల శ్యామ్, వైఎస్ఆర్సిపి నాయకులు పాల్గొన్నారు.

## మండల సమస్యలను కలెక్టర్కు తెలిపిన నాయకులు



**చంద్రుగొండ నవంబర్ 22 (ప్రజాక్షేత్రం):**

మండలంలోని పలు సమస్యలను కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్కు వివరించారు. ప్రధానంగా మండల కేంద్రంలోని పశు వైద్య ఆసుపత్రి ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం పలు సమస్యలను కలెక్టర్కు వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ధారా గోవిందా రెడ్డి, దిశా కమిటీ సభ్యులు బోర్రా సురేశ్, బుజ్యా నాయక్, సైదులు పాల్గొన్నారు.

## బెండాలపాడు క్లస్టర్ సందర్శించిన జిల్లా కలెక్టర్

**చంద్రుగొండ నవంబర్ 22 (ప్రజాక్షేత్రం):**





మండలం కేంద్రంలోని బెండాల పాడు గ్రామంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఈరోజు ఉదయం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన బ్యాంబో క్లస్టర్ పాయింట్ ను సందర్శించారు. బ్యాంబోతో చేసిన కళాకృతులను కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ సంధ్యారాణి, ఎంపీడీవో అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

# ప్రైవేటీకరణ జరగదని చెప్పడం మోసమే

- ప్రధాని చేత 29న ప్రకటన చేయించి చిత్తశుద్ధిని చాటండి
- కూటమి పార్టీ నేతలకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు హితవు
- నాడు సంక్షేమం, నేడు అభివృద్ధి పేర ప్రజలపై భారాలను సహించం
- పిఏసి ఛైర్మన్ ప్రతిపక్షాలకే ఇవ్వాలి




**విశాఖపట్నం, నవంబర్ 22(ప్రజాక్షేత్రం):**

విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై అసెంబ్లీ, శాసన మండలిలో చర్చ జరిగిందని, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా తీర్మానం చేయడానికి ప్రభుత్వం నిరాకరించిందని పైగా ప్రైవేటీకరణ జరగదని గతంలో కుమారస్వామి చేసిన ప్రకటనను కూటమి పార్టీల నేతలు చెప్పడం సరైంది కాదని ఇదే నిజమైతే విశాఖలో ఈఎల 29న పర్యటించనున్న ప్రధానమంత్రి మోడీ చేత బహిరంగ సభలో ప్రకటన చేయించి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు టిడిపి, జనసేన రాష్ట్ర నాయకులకు సవాల్ విసిరారు. శుక్రవారం ఉదయం విశాఖలోని జగదాంబ జంక్షన్‌లోగల ఎన్‌పిఆర్ భవన్‌లో సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం జగ్గునాయుడు, రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు కె లోకనాథం సంయుక్తంగా నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర స్టీల్ మంత్రి కుమారస్వామి ప్రైవేటీకరణ జరగదని అభయ హస్తం ఇచ్చినట్లు చెప్పారని చంద్రబాబు, పవన్ కల్యాన్ అంటున్నారని అన్నారు. అయితే కుమారస్వామి అన్న మరో మాటను ' ప్రధానే దీనేపై అంతిమ ప్రకటన చేయాల్సి ఉందని కుమారస్వామి చెప్పిన రెండో మాటను వదిలేశారని రాష్ట్ర పాలకులపై మండిపడ్డారు. కేంద్ర కేబినెట్‌లో టిడిపి భాగస్వామ్యం అయ్యిందని కేబినెట్‌లోనైనా తీర్మానం చేయించి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. ప్రైవేటీకరణపై కేంద్రంలోని బిజెపి 2 కమిటీలు (ట్రాన్జెక్షన్, అసెస్‌మెంట్) వేసిందని వీటిని రద్దు చేయకుండా ప్రైవేటీకరణ లేదని చెప్పడం అంటే ఎవరిని మోసం చేయడానికని శ్రీనివాసరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్టీల్‌ప్లాంట్‌పై వచ్చారని తనకు కలిశారని కానీ వివరాలు ఇవ్వలేదని పవన్ కల్యాన్ అనడం సరైంది కాదని ప్రభుత్వం వద్ద నిజంగా వివరాల్లేవా ప్రభుత్వం రప్పించుకోనక్కర్లేదా అని ప్రశ్నించారు. కూటమి అధికారంలోకి వచ్చిన ఈ 6నెలల్లో ఏనాడైనా స్టీల్‌ప్లాంట్‌పై రాష్ట్ర కేబినెట్‌లో చర్చించారా స్టీల్ ప్లాంట్‌ను ఎలా రక్షించాలో చర్చించారా కానీ అనకాపల్లి జిల్లా నక్కపల్లి వద్ద మిట్టల్ కంపెనీకి ఎంత రాయితీలు, భూమి, విద్యుత్ ఇవ్వడానికి పోర్టు లింకేమిటి అంటూ 2 సార్లు చర్చించారని ఎద్దేవా చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ కోసం ఉద్దేశించి నిర్మించిన గంగవరం పోర్టు గురించి మాత్రం మాట్లాడరని విమర్శించారు. 2033 నాటికి చట్ట ప్రకారం రాష్ట్ర ప్రభుత్వానికి గంగవరం పోర్టు హేండోవర్ కావాలని ఉన్నా గత ప్రభుత్వం తన 16శాతం వాటాను వదిలేసుకుందని, దీంతో స్టీల్‌ప్లాంట్‌కు కష్టాలు మొదలయ్యాయన్నారు. గంగవరం పోర్టు భూమిని ఆదానీ అడుగుతుంటే ఈ ప్రభుత్వం మిట్టల్ కోసం తీర్మానాలు చేస్తూ అదానీకి పోర్టు భూములు వదిలేస్తే సిపిఎం ఊరుకునేది లేదని హెచ్చరించారు. రాష్ట్రంలో ఎవ్వరికీ ఇవ్వని మెజారిటీ విశాఖ గాజువాకలో టిడిపిపై నమ్మకం ఉంచి మెజారిటీ ఇచ్చినా ఈ ప్రభుత్వానికి వైజాగ్ స్టీల్ కార్మికులపై కృతజ్ఞత లేదా అని విఎస్సార్ ప్రశ్నించారు. ఆదానీపై అరెస్ట్ వారెంట్ జారీచేసే దమ్ము ఉందా ఆదానీ కుంభకోణం ప్రపంచాన్నే షేక్ చేసిందని, గతంలో ఆదానీ ఆర్థిక భాగోతాలపై హిడెన్ బర్గ్ నివేదించిందని ఆంధ్రప్రదేశ్‌ను మింగేయాలని ఆదానీ చూస్తుంటే ప్రుభుత్వం మిన్నకుండడం తగదన్నారు. రూ. 2029 కోట్లరూపాయలు లంచాలను ఆదానీ ఇచ్చారని అందులో 1750 కోట్లు ఏపి లోనూ, కేంద్రంలో అధికారులకు ఇచ్చారని తెలుస్తుందన్నారు. ఆదానీపై అరెస్ట్ వారెంట్ జారీచేసే దమ్ము ఉందా రాష్ట్ర ప్రభుత్వానికి అవినీతిని అరికట్టరా అంటూ ప్రశ్నించారు. రాష్ట్రాన్ని మింగేయాలని ఆదానీ చూస్తున్నాడని 11వేల ఎకరాలు సత్యసాయి జిల్లా, నంద్యాల, మన్యం జిల్లాల్లో హైడెల్ పవర్ ప్రాజెక్టుల కోసం చూస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం మౌనంగా ఉండకుండా ఆదానీని 41 ఎ నోటీస్ ఇచ్చి ఎవరు డబ్బులు తీసుకున్నారో రహస్యాన్ని బయటపెట్టి అరెస్ట్ చేస్తారా? లేదా? డిమాండ్ చేశారు. పవన్ సనాతన ధర్మం డిక్షనరీలో అవినీతి గురించి ఉందా? లేదా ఆయన స్పందించాలన్నారు. సోలార్ పవర్ అర్థరూపాయికి వస్తుందని ఆదానీ మనపై 2.49 పైసలు మన నెత్తిన రుద్దాలని చూస్తున్నారని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దకుండా వారు సంక్షేమం పేరుతో భారాలు వేస్తే అభివృద్ధి పేర బాదుడుకు దిగడం సమంజసమా అని ప్రశ్నించారు. ఆదానీతో ఏం చర్చలు చేశారో బయటపెట్టాలని, ట్రూ ఆప్ ఛార్జీలు, స్మార్ట్‌మీటర్లు రద్దు చేస్తేనే అదానీ అవినీతికి అడ్డుకట్ట పడుతుందని లేదంటే ఆదానీతో కూటమి కుమ్మక్కయిందని ప్రజలు భావిస్తారని హెచ్చరించారు. రోడ్డువేసి టాక్సులు వేస్తామనడం చూస్తే కేంద్ర గ్రామీణ రూ.వేలకోట్ల నిధులు ఎక్కడికి పోతున్నాయని ప్రశ్నించారు. ఇరిగేషన్ ప్రాజెక్టుల్లో కూడా పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యం అని చంద్రబాబు చెప్పడం చూస్తే ఇదొక వినూత్న అవినీతి, ప్రజలపై భారం మోపడమేనని ప్రాజెక్టులు కట్టి రైతులపై పన్నులు వేయడం ఏమిటని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం కంటే నేడు ప్రజలు బ్యాంకులు, ప్రైవేట్ అప్పుల్లో కూరుకుపోయారని కూటమి ప్రభుత్వం ఆదనపు భారాలు వేయడం తగదన్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుద్యోగ డిఎస్సీపై సంతకాలు పెట్టారని 5 నెలల్కైనా అమల్లోకి రాలేదని 24 గంటల్లో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేర పెట్టుబడులకు క్లియరెన్సులు ఇస్తామనడం ఇదేం పాలన అని మండిపడ్డారు. ప్రజల కోసం ఎఫిషియెన్సీని వాడాలి తప్ప పెట్టుబడిదారుల కోసమా? అని ప్రశ్నించారు. ప్రభుత్వం కడపలో స్టీల్‌ప్లాంట్ పెడతామని చెబుతూ శంఖుస్థాపనలు చేస్తున్నారని మిట్టల్‌ప్లాంట్‌ను కడపలో పెడితే ఉపయోగం ఉంటుందని వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు దగ్గర్లో మరో ప్రైవేట్ ప్లాంట్ పెట్టడమంటే ప్రభుత్వ రంగాన్ని మూతపెట్టడం కాదా అని ప్రశ్నించారు. ఎన్నికలకు ముందు పవన్ కల్యాన్ 30వేల మంది అమ్మాయిలు రనాష్ట్రంలో తప్పిపోయారని గర్జన చేశారని అధికారంలోకొచ్చాక ఏం చేశారని అచూకీ కనిపెట్టారా అని వ్యాఖ్యానించారు. నేడు రోజుకు ఎక్కడో ఒక చోట అఘాయిత్యాలు జరుగుతున్నాయని అలాగే ఇప్పటివరకూ 160 మంది అక్రమ రవాణా చేయబడ్డారన్నారు. దోషులపై చర్యలు తీసుకోవాలని లేదంటే ఇది ఎన్నికల డ్రామా అని ప్రజలు భావించాల్సి వస్తుందన్నారు. విశాఖలో లా కాలేజీ విద్యార్థినిపై జరిగిన అఘాయిత్యంపైనా స్పెషల్ కోర్టు (ఫాస్ట్ ట్రాక్) కోర్టుల ద్వారా సత్వర న్యాయం జరిగేలా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్ ఛైర్మన్ పదవి విషయంలో సంప్రదాయం ప్రకారం ప్రతిపక్షాలకే ఇవ్వాలని గతంలో పయ్యావుల కేశవ్ కిచ్చారని నేడు పాటించలేదన్నారు. కేంద్రంలో మోడీ బాటలోనే రాష్ట్రంలోని కూటమి పయనిస్తుందని ఎద్దేవా చేశారు.ఇట్లు (ఎం. జగ్గునాయుడు)సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి

## తాండూరులో కాలుష్య పరీక్షలు..!

- ఆర్డీఎస్ యంత్రాలతో పొల్యూషన్ చెకప్
- పర్యవేక్షించిన పీసీబీ శాస్త్రవేత్త జీమోతా వాహన



**వికారాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 22 (ప్రజాక్షేత్రం):**

వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణంలో కాలుష్య పరీక్షలు జరిపారు. తెలంగాణ పోల్యూషన్ కంట్రోల్ బోర్డు(పీసీబీ) ఆధ్వర్యంలో శుక్రవారం ఈ పరీక్షలను చేపట్టారు. పీసీబీ పర్యావరణ శాస్త్రవేత్త జీమోతా వాహన ఆధ్వర్యంలో బృందం సభ్యులు గాలి కాలుష్యాన్ని నిర్ధారించే ఆర్డీఎస్ (రెస్పీ రేబుల్ డస్ట్ శ్యాంపేర్) యంత్రాలను ఏర్పాటు చేశారు. పట్టణంలోని పోలీస్టేషన్ మీద ఓ యంత్రం అమర్చగా.. పాత తాండూరు సమీపంలోని ఓ కాలనీలో మరో యంత్రాన్ని అమర్చారు. ప్రత్యేక కెమికల్స్ ను యంత్రాలలో కలిపి గాలి కాలుష్య పరీక్షలను ప్రారంభించారు.ఈ యంత్రాలు గాలిలో నాణ్యతతో పాటు కాలుష్యాన్ని నిర్ధారిస్తాయని వారు తెలిపారు. 24 గంటల పాటు యంత్రాలను ఆన్ లో ఉంచి పరీక్షలు జరపడం జరుగుతుందని వెల్లడించారు. ఆ తరువాత కాలుష్యాన్ని గుర్తించి నివేధికను ఉన్నత అధికారులకు అందిస్తామని తెలిపారు. ప్రతి యేడాది సాధారణ పరీక్షలలో భాగంగా కాలుష్య పరీక్షలు జరుపడంజరుగుతుందని, ఇందులో భాగంగా తాండూరులో ఈ ప్రక్రియ చేపట్టడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బృందం సభ్యులు రాజేందర్, శ్రీనివాస్, విక్రమ్ తదితరులు ఉన్నారు.

## జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు కస్తూరి ఫౌండేషన్ సహకారంతో అందజేయడం జరిగింది



**నాంపల్లి నవంబర్ 22(ప్రజాక్షేత్రం):**

గురువారం కస్తూరి ఫౌండేషన్ సహకారంతో నాంపల్లి మండలం పస్నూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చైర్లు అందజేసిన ఫౌండేషన్ సభ్యులు నాంపల్లి సతీష్, మట్టిపల్లి శ్రీశైలం పంగ లింగస్వామి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సి ఎం ఆర్ ఫ్ చెక్కును పంపించేసిన కాంగ్రెస్ పార్టీ పట్టణప్పుడు లీడర్ అర్ధ సుధాకర్ రెడ్డి



**వికారాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్22 (ప్రజాక్షేత్రం):**

వికారాబాద్ మున్సిపల్ లోని బూరుగుపల్లి వార్డుకి సంబందించిన పద్మమ్మ గారికి CMRF (ముఖ్య మంత్రి సహాయ నిధి ) చెక్కును అందజేసిన పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ శ్రీ. అర్ధ. సుధాకర్ రెడ్డి గారు

## అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం..!

- తాండూరు మార్కెట్ కమిటి చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి
- మున్సిపల్‌లో సీసీ డ్రైన్ పనులు ప్రారంభం.



**వికారాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 22 (ప్రజాక్షేత్రం):**

ప్రజలకు అవసరమైన అభివృద్ధిని అందించడమే ప్రభుత్వ ధ్యేయమని తాండూరు మార్కెట్ కమిటి చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తాండూరు పట్టణం 11వ వార్డులోని ఆదర్శనగర్‌లో డీఎంఎఫ్టీ ద్వారా రూ. 5లక్షలతో నిర్మిస్తున్న సీసీ డ్రైన్ పనులను బాల్‌రెడ్డి మున్సిపల్ కౌన్సిలర్లు పట్లోళ్ల నీరజాబాల్‌రెడ్డి, సోమశేఖర్లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని అన్నారు. తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి సహకారంతో పట్టణంలోని అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని అన్నారు. ప్రతి వార్డులో సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణం జరుగుతుందని తెలిపారు. అభివృద్ధికి నిధులు కేటాయించి సమస్యలు పరిష్కరించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. అదేవిధంగా కౌన్సిలర్ నీరజాబాల్‌రెడ్డి మాట్లాడుతూ వార్డుల్లో అభివృద్ధి పనులు చేపట్టడం పట్ల ఎమ్మెల్యేకు, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ తాండూరు పట్టణ అధ్యక్షులు బంటు వేణుగోపాల్, వార్డు పెద్దలు, కాంట్రాక్టర్ తదితరులు ఉన్నారు.

## భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ ఆశ్వారావుపేట పర్యటన

**అశ్వారావు నవంబర్ 22 (ప్రజాక్షేత్రం):**

జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ అశ్వారావుపేట పోలీస్ స్టేషన్ ను సందర్శించడం జరిగింది. ముందుగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి అక్కడ పోలీస్ సిబ్బంది క్వార్టర్స్ కోసం కేటాయించిన స్థలాన్ని కూడా పరిశీలించారు.పోలీస్ స్టేషన్లో పెండింగ్లో ఉన్న కేసులను పరిశీలించారు.పెండింగ్లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలని,ఏమైనా సందేహాలు తలెత్తితే ఉన్నతాధికారుల సలహాలతో న్యాయాధికారులతో సమన్వయం పాటిస్తూ వాటిని పరిష్కరించే విధంగా పనిచేయాలని సూచించారు.రాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న పోలీస్ స్టేషన్ ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టాలని, గంజాయి వంటి మత్తు పదార్థాల అక్రమ రవాణాను సమర్థ





వంతంగా అరికట్టాలని సూచించారు. కోడి పందాలు,జూదం అలాంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్ప డే వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని సూచిం చారు. అనంతరం పోలీస్ స్టేషన్లో విధులు నిర్వర్తించే అధికారులు మరియు సిబ్బందిని వర్టికల్స్ వారీగా వారి పని సామర్థ్యాన్ని గురించి తెలుసుకున్నారు.ఎవరికి కేటాయించిన విధులను వారిని సక్రమంగా నిర్వర్తించాలని తెలియజేసారు. విధుల పరంగా ఏమైనా సమస్యలు తలెత్తితే వెంటనే తమ దృష్టికి తీసు కురావాలని కోరారు.ఈ కార్యక్రమంలో అశ్వరావుపేట సిఐ కరుణాకర్,ఎస్బి ఇన్స్పెక్టర్ నాగరాజు,ఎస్సైలు యాయాతి రాజు,శివరామకృష్ణ,దమ్మపేట ఎస్సై సై కిషోర్ రెడ్డి మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళలు, విద్యార్థుల భద్రతే షీ టీమ్ ప్రధాన లక్ష్యం

- నూతన చట్టాలు, సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలి..
- షీ టీమ్ సభ్యులు రోజా.



**పెద్దేముల్ నవంబర్ 22(ప్రజాక్షేత్రం):**

మహిళలు విద్యార్థుల భద్రతే షీ టీమ్ యొక్క ప్రధాన లక్ష్యమని షీ టీమ్ ఇంచార్జ్ శేఖర్ అన్నారు.శుక్రవారం పెద్దేముల్ మండల పరిధిలోని గొట్లపల్లి మోడల్ స్కూల్లో మహిళలపై జరుగుతున్న నేరాలు, పోక్సో చట్టం, 100 డయల్, బాల్య వివాహాలు, సైబర్ నేరాలు, మానవ అక్రమ రవాణా, తదితర అంశాల పైన అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు చెడు వ్యసనాలకు అలవాటు పడి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోదని సూచించారు. అదేవిధంగా మద్యపానం,ధూమపానం, డ్రగ్స్, గంజాయి వంటి వాటికి దూరంగా ఉండాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా సైబర్ నేరగాళ్ళ ఉచ్చులో పడొద్దని, అపరిచితుల నుండి వచ్చే ఫోన్ కాల్స్, వంటి వాటికి స్పందించోద్దని అన్నారు. ఒకవేళ కొత్త నెంబర్ల నుండి కాల్స్ వచ్చినప్పుడు 1930 కి డయల్ చేయాలని వారు పేర్కొన్నారు. ఈ మధ్య కాలంలో ఆన్లైన్ మోసాలు తరచుగా చూస్తూనే ఉన్నాం.అలాంటి వాటి పట్ల ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని పునరుద్ఘాటించారు.ఈ క్రమంలో మీతోటి చిన్నారులు ఎవరైనా నిషేధిత జాబితాలో పని చేసినట్లయితే అలాంటి బాల కార్మికులను రక్షించాల్సిన బాధ్యత మనమందరం తీసుకోవాలని వెల్లడించారు.ఈ నేపథ్యంలో బాల్య వివాహాలు చేసుకుని భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని బాలికలకు సూచించారు. మన చుట్టుపక్కల ఏమైనా నేరాలు జరిగినట్లయితే 100కు డయల్ చేయాలని విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గాయత్రి, హెడ్ కానిస్టేబుల్ శేఖర్, షీ టీం సభ్యులు రోజా, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## గోవుల అక్రమ రవాణా

- పదియేడు ఆవులు ఐదు లేగదూడల గోశాలకు అప్పగింత
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడి.




**పెద్దేముల్ నవంబరు 22(ప్రజా క్షేత్రం):**

గోవులను అక్రమంగా తరలిస్తున్న కంటైనర్ పట్టుకున్నట్లు ఎస్సై గిరి వెల్లడించారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం రాత్రి సుమారు 11:30 గంటల సమయంలో కోహీర్ ప్రాంతానికి చెందిన జైనోద్దీన్ అనే వ్యక్తి తన కంటైనర్ నెంబర్ %ం12ఖఎ%6870లో తాండూర్ నుండి గోవులను అక్రమంగా జహీరాబాద్ కు తరలిస్తుండగా, నిర్దిష్ట సమాచారం మేరకు తట్టేపల్లి గ్రామ శివారులో వాహనాన్ని పట్టుకున్నట్లు ఎస్సై గిరి తెలిపారు. ఇట్టి వాహనంలో పదియేడు ఆవులు, ఐదు లేగ దూడలు ఉన్నట్లు ఆయన వివరించారు. ఇట్టి ఆవులకు ఎలాంటి అనుమతులు లేకపోవడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గిరి వెల్లడించారు. ఈ క్రమంలో ఎవరైనా ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా మూగజీవులను రవాణా చేస్తే చట్టరీత్యా సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

## శ్రీ లింబాద్రి లక్ష్మీ నృసింహా స్వామివారి దేవస్థానం హుండీ లెక్కింపు



**భీంగల్ నవంబర్:22(ప్రజాక్షేత్రం):**

భీంగల్ పట్టణంలోని శ్రీ లింబాద్రి లక్ష్మీనృసింహా స్వామివారి గ్రామాల యంలో దేవాదాయ శాఖ పరిశీలకురాలు కమలమ్మ ,క్లర్క్ చిన్నయ్య , సతీష్ ,అటెండర్ బాలయ్య వీళ్ళ సమక్షంలో స్వామివారి భక్తుల ఆధ్వర్యం లో నిర్వహించిన స్వామివారి రెగ్యులర్ హుండీ, అన్నదాన హుండీల వివర ములను ఆలయ ధర్మకర్త నంబి పార్థసారథి తెలిపారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ హుండీలలో జాతర ఆదాయమే కాకుండా రెండు నెలల వెనక ఆదాయం కూడా కలిసి ఉన్నదని అన్నారు. రెగ్యులర్ హుండీలో రూపాయలు 14,85,752,అన్నదాన హుండీలో రూపాయలు 6,06,315 ఆదాయం వచ్చిందని,ఈ రెగ్యులర్ హుండీ ద్వారా సుమారుగా మిశ్రమ వెండి 670 గ్రాములు,మిశ్రమ బంగారం 13 గ్రాముల 500 మిల్లి గ్రాములు రావడం జరిగిందని అన్నారు.ఈ వెండి, బంగారంలను సీల్ చేసి దేవస్థానం లాకర్ నందు భద్రపరుచుటకు అప్పగించబడినదని, నగదు రూపంలో వచ్చినటువంటి ఆదాయం అంతా కూడా స్వామివారి ఖాతా యందు జమ చేయబడినది తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళ సేవకులందరూ పాల్గొని జయప్రదం చేయడం జరిగింది అని తెలిపారు.

## సీఎం రేవంత్ సోదరుడి అరాచకాలు..

- లగచర్ల ఘటనపై బీజేపీ ఎంపీల సంచలన వ్యాఖ్యలు



**సంగారెడ్డి జిల్లా నవంబర్ 22 (ప్రజాక్షేత్రం):**

సీఎం రేవంత్‌రెడ్డికు ఫార్మా కంపెనీలపై అంత ప్రేమ ఎందుకని బీజేపీ ఎంపీ డీకే అరుణ ప్రశ్నించారు. సోమవారం సంగారెడ్డి జిల్లాలోని సెంట్రల్ జైలు వద్దకు వెళ్లి లగచర్ల కేసులో జైలులో ఉన్న 16 మందితో బీజేపీ ఎంపీలు ఈటల రాజేందర్, డీకే అరుణ, ఆ పార్టీ కీలక నేతలు ములాఖత్ అయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ.. లగచర్ల గ్రామంలో ఫార్మా కంపెనీకి భూమి ఇవ్వబోమని 8 నెలలుగా ఆందోళన చేస్తున్నారని అన్నారు. బలవంతంగా భూములు లాక్కుంటామని అధికారులు చెప్పడంతో రైతులు ఆగ్రహనికి గురయ్యారని చెప్పారు. రైతులు ప్రజాభిప్రాయ సేకరణను బహిష్కరించారని అన్నారు. వాస్తవంగా ప్రజాభిప్రాయ సేకరణకు రాకపోతే వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఒక్కరే ఎందుకు వెళ్లారని నిలదీశారు. పోలీసుల వైఫల్యంతోనే ఈ ఘటన జరిగిందని చెప్పారు. సీఎం రేవంత్ సోదరుడు అక్కడ ఉన్న రైతులను బయపెట్టారని అన్నారు. భూములు ఎలాగైనా గుంజుకుంటామని చెప్పారన్నారు. ఈ ఘటన తర్వాత రాత్రి గ్రామాల్లోకి వచ్చి పోలీసులు ఇష్టం వచ్చినట్లుగా దాడి చేశారని అన్నారు. గొడవ జరిగిన ఘటనలో కాంగ్రెస్ పార్టీ వారిని వదిలేసి మిగతా వారిని అరెస్ట్ చేశారని మండిపడ్డారు. భూములు ఇవ్వమని చెబితే సీఎం రేవంత్ స్వయంగా వెళ్లి వారిని కలిసి మాట్లాడితే బాగుండేదని అభిప్రాయం వ్యక్తం చేశారు. కానీ ఇవన్నీ చేయకుండా భయపెట్టి దాడులు చేయించి ఇలా చేయడం కరెక్టు కాదని హితవు పలికారు. సీఎం సోదరుడు అక్కడికి వెళ్లవచ్చు కానీ తనను అక్కడికి వెళ్లకుండా ఎందుకు అడ్డుకున్నారని ప్రశ్నించారు. రైతులతో దౌర్జన్యంగా బెదిరించి సంతకాలు పెట్టించుకుంటున్నారని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి సీఎం అయితే తమ నియోజకవర్గం బాగుంటుందని అనుకుంటే మీరేమో జనాలపై కక్ష కట్టారని ధ్వజమెత్తారు. ఓటేసి గెలిపించిన జనాల కాంటే మీకు ఫార్మా కంపెనీ ముఖ్యమా అని ప్రశ్నించారు. సీఎం కొడంగల్ వాసి కాదు వలస వచ్చారని విమర్శలు చేశారు. మీకు నచ్చిన వారికి కంపెనీలు అప్పజెప్పడానికే ఫార్మా కంపెనీలు పెడుతున్నారా అని నిలదీశారు. వెంటనే లగచర్ల బాధితులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పంథాలు వద్దు నియోజకవర్గ ప్రజల ఆకాంక్ష ముఖ్యమని తెలిపారు. పేదల ఉసురు పోసుకున్న కేసీఆర్ ఇంటికి పోయారని.. మీరు 11 నెలలకే పేదల ఉసురు పోసుకుంటున్నారని విమర్శించారు. సీఎం రేవంత్ అహంకారం వీడాలి..రైతులను ఒప్పించి భూములు తీసుకోవాలని డీకే అరుణ కోరారు.

## తార్నాకలో రోడ్లపై కులగణన సర్వే దరఖాస్తులు!



**హైదరాబాద్ నవంబర్ 22 (ప్రజాక్షేత్రం):**

తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సమగ్ర కుటుంబ సర్వే చేపట్టిన విషయం తెలిసిందే. సమగ్ర కుటుంబ సర్వే ఫారాలు రోడ్డు పాలవుతున్నాయని ఆరోపణలు వస్తున్నాయి. ఈ క్రమంలోనే ఓ వీడియో నెట్టింట్ తాజాగా వైరల్‌గా మారింది. హైదరాబాద్‌లోని తార్నాకలో తార్నాకలో కుల గణన సర్వే దరఖాస్తులు కొన్ని రోడ్లపై చిత్తుకాగితాల మాదిరి పడి ఉన్నాయి. దీనికి సంబంధించిన వీడియో తాజాగా వైరల్ అవుతోంది. కాగా, ఇటీవల కూడా మేడ్చల్ పరిధిలోని రేకుల బావి చౌరస్తా నుంచి భారత్ పెట్రోల్ బంక్ వరకు 44వ జాతీయ రహదారి పొడవునా గురువారం సాయంత్రం సమగ్ర కుటుంబ సర్వే ఫారాలు దర్శనమిచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన సమగ్ర కుటుంబ సర్వే ఫారాలు రోడ్లపై కన్పించడం చర్చనీయాంశంగా మారింది. గతంలోనూ ప్రజా పాలన అప్లికేషన్లు రోడ్లపాలు చేశారని నెటిజన్లు గుర్తు చేస్తున్నారు. వ్యక్తిగత సమాచారాన్ని ఇలా రోడ్లపై వేయడం ఎంతవరకు కరెక్ట్ అని నెటిజన్లు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు.

## మున్సిపల్ కార్యాలయంలో ముందస్తు అనుమతి తీసుకొని ఫ్లెక్సీలను పెట్టాలి



**భీంగల్ నవంబర్: 22(ప్రజాక్షేత్రం):**

భీంగల్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఇకముందు ముందస్తు అనుమతి తీసుకుని ఫ్లెక్సీలను ప్రధాన రహదారుల వెంబడి,డివైడర్ మధ్యలో పెట్టాలని మున్సిపల్ కమిషనర్ వై రామకృష్ణ ఆదేశించారు. పట్టణంలోని ప్రధాన రహదారుల వెంబడి,డివైడర్ మధ్యలో ఉన్న ఫ్లెక్సీల వల్ల ప్రజలకు ఇబ్బందికరంగా ఉన్నందున వాటి వల్ల ప్రమాదాలు జరగవచ్చని, డివైడర్ మధ్యలో ఉన్న సెంట్రల్ లైట్ అక్కడక్కడ పాడైపోయినందున వాటిని రిపేర్ చేయించవలసి ఉన్నదని ఇట్టి ఫ్లెక్సీలను రెండు దినములలో తీసివేయాలని అన్ని పార్టీల ప్రజాప్రతినిధులకు, నాయకులకు పత్రిక ప్రకటనలో తెలిపారు.

# పదేళ్లలో విద్యావిధానం నాశనమైంది..

- రాష్ట్ర విద్యా కమిషన్ ఛైర్మన్

**వరంగల్ నవంబర్ 22(ప్రజాక్షేత్రం):**

గత ప్రభుత్వం విద్యావ్యవస్థను ఏమాత్రం పట్టించుకోకపోవడంతో తెలంగాణ రాష్ట్రం దేశంలో అట్టడుగున నిలిచి ఉందని రాష్ట్ర విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి అన్నారు. విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు కముషన్ జిల్లాలో చర్చా వేదికలు నిర్భహిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. భూపాలపల్లి కలెక్టరేట్‌లో శుక్రవారం రాష్ట్ర సమగ్ర విద్యా విధానం పై ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ఇతర వర్గాల ప్రజలతో చర్చా, సలహాలను స్వీకరించేందుకు రాష్ట్ర విద్యా కమిషన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ రాహుల్ శర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో జిల్లాకు చెందిన విద్యావేత్తలు. వివిధ పాఠశాలల విద్యార్థులు, విద్యావేత్తలు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యావ్యవస్థ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యల పై వారి నుంచి సలహాలు, సూచనలు స్వీకరించింది. ఈ సందర్భంగా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యావ్యవస్థను బలోపేతం చేయడానికి సమాజంలోని భిన్న వర్గాల నుంచి సమాచారం తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ పర్యటనల్లో ప్రభుత్వ పాఠశాలలో పాటు కేంద్రీయ విద్యాలయాలు, యూనివర్సిటీలు, కార్పొరేట్ స్కూల్స్, కాలేజీల్లో పర్యటిస్తున్నట్ల తెలిపారు. పర్యటనల ముఖ్య ఉద్దేశం ఈ రోజు విద్యా పరిస్థితి చాలా దయనీయంగా ఉందని, గత పాలకులు చేసినటువంటి అరాచకాలు వలన విద్యా వ్యవస్థ దెబ్బతిందని పేర్కొన్నారు. గత పది సంవత్సరాలు విద్యా విధానం నాశనమైందని తెలిపారు.

### మెరుగైన విద్యా వ్యవస్థలో ర్యాంకులో అట్టడుగున రాష్ట్రం..!

మెరుగైన విద్యావ్యవస్థలో ర్యాంకులో అట్టడుగున తెలంగాణ రాష్ట్రం అట్టడుగున ఉండటం బాధాకరమని ఆకునూరి అన్నారు. దేశంలో ప్రతి రెండు మూడు సంవత్సరాలకు చేసే సర్వేలలో 29 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు మొత్తం పరిశీలించగా మన రాష్ట్రం ర్యాంకు విద్యా విధానంలో 32 స్థానంలో ఉందని తెలిపారు. దాన్ని బట్టి మన విద్యా వ్యవస్థ ఎంత దిగజారిపోయిందో అర్థం చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ ప్రభుత్వం విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలని నిర్ణయించిందని అన్నారు. మెరుగైన విధానాలను అమలు చేసేందుకు ప్రజల నుంచే సలహాలు, సూచనలు తీసుకుని ప్రణాళికను రూపొందించనుందని అన్నారు. రాష్ట్రంలో మెరుగైన విద్యావిధానాన్నిఅమలు చేసేందుకు పొరుగు రాష్ట్రాల్లో, విదేశాల్లో కూడా పర్యటిస్తూ అధ్యయనం చేస్తున్నట్లు తెలిపారు. మన రాష్ట్రంలో గద్వాల జిల్లా చాలా వెనుకబడి ఉందని, అందుకనే అక్కడ నుండే ఈ చర్చా వేదికలు ప్రారంభించామని, తర్వాత స్థానాల్లో భూపాలపల్లి, ములుగు జిల్లాలు అత్యంత వెనుకబడి ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. అందుకనే వెనుకబడిన ప్రాంతాల్లో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల నుండి సలహాలు, సూచనలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రతి జిల్లాలలో ఇలాంటి చర్చా వేదిక నిర్వహించి ప్రభుత్వానికి నివేదిక అందజేయనున్నట్లు ఆయన తెలిపారు.




### విద్యా సంస్కరణలు తీసుకురావడానికి ప్రభుత్వం కృషి : కలెక్టర్ రాహుల్ శర్మ..

జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ విద్యలో నూతన సంస్కరణలు తీసుకురావడానికి తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు తెలిపారు. కమిటీ సభ్యులు జ్యోత్స్నా రెడ్డి, వెంకటేష్, విశ్వేశ్వర్‌రావు మాట్లాడుతూ చర్చకు వచ్చిన ప్రతి విషయాన్ని పరిగణనలోకి తీసుకుంటామని, మంచి సలహాలు, సూచనలు ఇచ్చారని అభినందించారు. ముఖ్యమంత్రి ఆలోచన విధానం, ప్రత్యేక దృష్టితో సమూల మార్పు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. చర్చా వేదికలో ప్రత్యేక ఆకర్షణగా మహాదేవపూర్ జడ్పి ఉన్నత పాఠశాల విద్యార్థులు సాయి ప్రదీప్తిక, అన్విత మహదేవపూర్ జడ్పి ఉన్నత పాఠశాలలో 9 వ తరగతి చదువుతున్న విద్యార్థులు సాయి ప్రదీప్తిక, అన్విత నేత్రావదానం వీక్షించిన ఛైర్మన్, జిల్లా కలెక్టర్, కమిటీ సభ్యులు అభినందించారు.

### విద్యాసంస్థల్లో మౌలిక వసతులు కల్పించాలి : విద్యావేత్తలు, తల్లిదండ్రులు..

సమావేశానికి హాజరైన ఉపాధ్యాయులు, తల్లితండ్రులు, వక్తలు మాట్లాడుతూ రవాణా సౌకర్యాలు, మౌలిక సదుపాయాల లేమి వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో చేరేందుకు విద్యార్థుల తల్లితండ్రులు ఆసక్తి చూపడం లేదని తెలిపారు. రీడింగ్ రూములు ఏర్పాటు, డ్రిల్ పిరిడ్, ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఉన్నతస్థాయిలో ఉన్న వ్యక్తులచే విద్యార్థులకు మోటివేషన్ తరగతులు నిర్వహించాలని తెలిపారు. ఐఐటీ, జేఈఈ, మెడిసిన్ వంటి ఉన్నత చదువులు చదివే విద్యార్థులకు మెటీరియల్ అందించాలని సూచించారు. వైకల్యం ఉన్న విద్యార్థులకు ప్రత్యేక సిబ్బంది నియామకాలు చేపట్టాలని అన్నారు. అలాంటి విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు కల్పించాలని తెలిపారు. కంప్యూటర్, సైన్స్ ల్యాబ్స్ సౌకర్యాలు ఉండాలని తెలిపారు.

# పెన్షన్ దారులను మోసం చేసిన సీఎం రేవంత్ రెడ్డి


- ప్రజా కోర్టులో రేవంత్ రెడ్డిని నిలబెడతామంటున్న పెన్షన్ దారులు
- విహెచ్పిఎస్ జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశి

**కంఠేశ్వర్ నవంబర్ 22 (ప్రజాక్షేత్రం):**

పెన్షన్ దారులను తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మోసం చేస్తున్నారని ప్రజా కోర్టులో రేవంత్ రెడ్డిని పెన్షన్ దారులు నిలబెడతారని విహెచ్పిఎస్ జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ అన్నారు. ఈ మేరకు శుక్రవారం వికలాంగుల హక్కుల పోరాట సమితి పెన్షన్ పెంపుకై చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు 5వ రోజుకు చేరుకుంది. ఈ 5వ రోజ జరుగుతున్న రిలే నిరాహారదీక్షలకు విహెచ్పిఎస్ జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 11 నెలలు గడిచిన పెంచుత అన్న అన్ని సామాజిక పెన్షన్లను పెంచకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వికలాంగులకు ఇంకా ఎన్నో హామీలు ఇవ్వడం జరిగింది. వికలాంగుల మంత్రిత్వ శాఖను ఏర్పాటు చెయ్యాలి. వికలాంగులకు ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలి. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం దిగివచ్చి హామీలను అమలుపరచాలి. లేకుంటే నవంబరు 26న పెన్షన్ దారుల మహా గర్జన పేరుతో ఇంద్ర పార్క్ లో లక్షలాది పెన్షన్ దారులతో అన్ని రాజకీయ పార్టీలను అఖిలపక్షంగా భాగస్వామ్యం చేసి రేవంత్ రెడ్డి మీద యుద్ధం ప్రకటిస్తామని హెచ్చరించారు. అనంతరం ఎన్టీఆర్ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. సుమారు 20 నిమిషాల పాటు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. 20 నిమిషాల పాటు రెండు వైపులా రోడ్డుపై భీష్మించి నుంచి కూర్చున్నారు. ఈ దీక్షలో విహెచ్పిఎస్ జిల్లా అధ్యక్షులు కంటేశ్వర్ బీరప్ప, విహెచ్పిఎస్ జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుల నారాయణ జిల్లా నాయకులు విహెచ్పిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు షేక్ సలీం , మహిళా విభాగం అధ్యక్షురాలు చిట్టి కృష్ణవేణి భామని పోశెట్టి గంధాల గంగాధర్ శ్రీనివాస్ యాదవ్ తిరుమల నాయక రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.



## హైకోర్టు తీర్పు.. బీఆర్ఎస్ నేతలకు చెంప చెళ్లుమనిపించేలా ఉంది



**హైదరాబాద్, నవంబర్ 22 (ప్రజాక్షేత్రం):**

ఎమ్మెల్యేల అనర్హతపైన హైకోర్టు ఇచ్చిన తీర్పు బీఆర్ఎస్ పార్టీ నేతలకు చెంప చెళ్లుమనిపించేలా ఉందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. హైకోర్టులో బీఆర్ఎస్ భంగపడిందని, అనర్హతపైన సర్వాధికారులు స్పీకర్ కు ఉన్నాయని కోర్టు తేల్చిందన్నారు. తగిన సమయంలో స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని మాత్రమే న్యాయస్థానం సూచించింది కానీ నిర్ణిత సమయాన్ని కోర్టు ప్రస్తావించలేదని చెప్పారు. అన్ని విషయాలు తెలిసి కూడా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కోర్టుకు వెళ్లి దెబ్బతిన్నారని ప్రభుత్వ విప్ ఎద్దేవా చేశారు. రాజ్యాంగం ప్రకారం సభాపతి నడుచుకుంటారని, కోర్టు తీర్పు రాకుండానే గతంలో కేటీఆర్ ఈ విషయంలో ఎగిరెగిరి పడ్డి, అప్పుడే ఉప ఎన్నికలు వచ్చినట్లుగా హడావిడి చేశాడని విమర్శించారు. చేసిన పాపం గోచిలో పెట్టుకొని కాశీకి పోయినట్లు కేటీఆర్, బీఆర్ఎస్ నేతల తీరు ఉందని, 10 ఏళ్ల పాటు రాజ్యాంగాన్ని అపహస్యం చేసి ఇప్పుడు సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని ఆది శ్రీనివాస్ మండిపడ్డారు. ప్రతిపక్ష పార్టీలకు చెందిన 60 మందికి పైగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలను బీఆర్ఎస్ చేర్చుకుంది. ప్రతిపక్ష పార్టీకి చెందిన ఎమ్మెల్యేలను క్యాబినెట్ లో చేర్చుకొని నైతిక విలువలను కాళేశ్వరంలో కలిపారని, పార్టీలకు పార్టీలను విలీనం చేసుకుని రాజ్యాంగాన్ని ఖూనీ చేశారని ఆరోపించారు. ప్రతిపక్ష పార్టీలు ఎంత గగ్గోలు పెట్టినా కేసీఆర్ లెక్కచేయలేదన్నారు. తెలంగాణ పునర్ నిర్మాణం కోసం ఫిరాయింపులు చేసుకోవచ్చునని నిర్లజ్జగా చెప్పుకొని తిరిగి ఇప్పుడు అధికారం పోగానే రాజ్యాంగం, న్యాయస్థానాలు గుర్తుకు వచ్చాయన్నారు. భవిష్యత్తులో బీఆర్ఎస్ ఖాళీ కావడం ఖాయమని, ఐదారుగురు తప్ప మిగిలిన ఎమ్మెల్యేలు ఆ పార్టీలో ఉండరని చెప్పుకొచ్చారు. కేసీఆర్ ఫామ్ హౌస్ కు, కేటీఆర్ గెస్ట్ హౌస్ కు, హరీష్ రావు నార్సింగి హౌస్ కు పరిమితం కావాల్సిందే అని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ జోస్యం చెప్పారు.

## ఆదర్శ పాఠశాల సెప్టిక్ ట్యాంక్‌లో మృతదేహం లభ్యం..



**శంకర్ పల్లి నవంబర్ 22 (ప్రజాక్షేత్రం):**

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఆదర్శ పాఠశాలలో లభ్యమైన సంఘటన శంకర్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శంకర్ పల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఆదర్శ పాఠశాల సెప్టిక్ ట్యాంకులో శుక్రవారం సాయంత్రం విద్యార్థులు ఆటలాడుకుంటుండగా సెప్టిక్ ట్యాంక్ పైన మూత లేకపోవడంతో పైకి తేలిన శవం చూసి ఉపాధ్యాయులకు తెలిపారు. దీంతో ఉపాధ్యాయులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. హుటాహుటిన శంకర్ పల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ గౌడ్ సిబ్బందితో కలిసి వచ్చి సంఘటన జరిగిన తీరును పరిశీలించారు. మున్సిపల్ సిబ్బందితో శవాన్ని వెలికి తీశారు.శవం పూర్తిగా కుళ్ళిపోయింది. అయితే వెలికి తీసిన శవం నుంచి తలతో పాటుగా రెండు చేతులు ఊడిపోయి ఉన్నాయి. ట్యాంకులో తలను వెతకగా కొద్దిసేపటికి లభ్యమయింది. చేతులు మాత్రం దొరకలేదు. సుమారు నెలరోజుల క్రితం చనిపోయి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతుడికి సుమారు 35 నుంచి 40 సంవత్సరాల వయసు ఉంటుందని తెలిపారు. ప్రమాదవశాత్తు కాలుజారి ట్యాంకులో పడి చనిపోయాడా ? లేక ఎక్కడైనా చంపేసి ట్యాంకులో పడవేశారా మృతుని వివరాలకు కూడా తెలియ రాలేదు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు శంకర్పల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఆయన తెలిపారు.



# గర్ల్ ఇన్ గోల్డెన్ గౌన్.. రాధిక సో గ్లామరస్!



నేహా శెట్టి.. ఈ పేరు వింటేనే అందరికీ రాధిక రోల్ గుర్తుకు వచ్చేస్తుంది. బ్లాక్ చీరలో ఆమె వయ్యారంగా నిలుచున్న సీన్ మైండ్ లోకి వచ్చేస్తుంది. టాలీవుడ్ స్టార్ బాయ్ సిద్ధు జొన్నలగడ్డ హీరోగా తెరకెక్కి ప్రేక్షకుల ముందుకు వచ్చిన డీజే టిల్లు మూవీతో అంతలా మెప్పించింది నేహా. రాధికగా అందరి మనసుల్లో నిలిచిపోయారు. తెలుగు సినీ ఇండస్ట్రీలో ఓ రేంజ్ లో క్రేజ్ సంపాదించుకున్నారు. కన్నడ బ్యూటీ అయిన నేహా శెట్టి.. ముంగారు మేల్ మూవీతో సినీ ఇండస్ట్రీలో ఎంట్రీ ఇచ్చింది. శాండల్ వుడ్ లో ఆ సినిమా మిక్స్ డ్ టాక్ అందుకుంది. కానీ మూవీలో నేహ తన అందచందాలతో మెప్పించి.. ఆ తర్వాత పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో ఆకాశ్ పూరి హీరోగా నటించిన మెహబూబా మూవీతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది. అక్కినేని అఖిల్ మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్ మూవీలో ఓ చిన్న పాత్రలో కనిపించింది. ఆ తర్వాత డీజే టిల్లు మూవీతో ఒక్కసారిగా లైమ్ లైట్ లోకి వచ్చారు. తెలుగులో వరుసగా ఆఫర్లు అందుకున్నారు. గతేడాది బెదురులంక 2012, రూల్స్ రంజన్ చిత్రాల్లో యాక్ట్ చేసి, డీజే టిల్లు సీక్వెల్ గా తెరకెక్కిన టిల్లు స్క్వేర్ మూవీలో నేహా శెట్టి గెస్ట్ రోల్ లో కనిపించి మెప్పించింది. టిల్లు క్యూబ్ లో కూడా నటించనున్నట్లు తెలుస్తోంది. రీసెంట్ గా విశ్వక్ సేన్ హీరోగా నటించిన గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి మూవీలో కూడా కనిపించింది. తన యాక్షన్ తో అందరినీ ఆకట్టుకున్నారు. రాధికగా చెరగని ముద్ర వేసుకున్న ఆమె పలు సినిమాల్లో హీరోయిన్ గా నటిస్తూ కెరీర్ లో దూసుకెళ్తున్నారు. తక్కువ టైమ్ లోనే మంచి ఫేమ్ సొంతం చేసుకున్నారు. అదే సమయంలో సోషల్ మీడియాలో ఓ రేంజ్ లో సందడి చేస్తుంటారు. కొత్త కొత్త పిక్స్ తో అట్రాక్ట్ చేస్తుంటారు. రోజురోజుకు ఫాలోవర్స్ ను పెంచుకుంటున్నారు నేహా శెట్టి. తన గ్లామర్ తో మాయ చేస్తున్నారు. తాజాగా కొత్త పిక్స్ ను షేర్ చేస్తూ.. గోల్డ్ కలర్ డ్రెస్ లో గ్లామర్ షో చేశారు. తన స్కిన్ అండ్ లెగ్స్ షోతో ఫిదా చేసింది. తన లుక్స్ తో మైమరిపించి అందరినీ ఆకట్టుకుంటున్నారు. నెట్టింట ఫుల్ వైరల్ అవుతున్న నేహా నయా ఫోటోస్ కు నెటిజన్లు ఫిదా అవుతున్నారు. పిక్స్ అదిరిపోయాయని చెబుతున్నారు. సెగలు రేపుతున్నాయని.. గర్ల్ ఇన్ గోల్డెన్ గౌన్ అంటూ కామెంట్లు పెడుతున్నారు.

# ట్రెడిషనల్ లుక్స్‌తోనే భాగ్యశ్రీ హై గ్లామర్ ట్రీట్



తెలుగు సినిమా రంగంలో తన ప్రత్యేకమైన అందంతో యువత హృదయాలను గెలుచుకున్న భాగ్యశ్రీ బోర్సే, తాజాగా మరోసారి తన సోషల్ మీడియాలో ప్రత్యేకమైన లుక్స్ తో ఆకట్టుకుంటోంది. గుండెల్ని తాకే ఎరుపు డ్రెస్ లో భాగ్యశ్రీ చూపిన స్టైల్ ప్యూర్ మ్యాజిక్ అని చెప్పొచ్చు. ఈ ఫోటోల్లో ఆమె చూపులు, చిరునవ్వు నెటిజన్లను మంత్రముగ్ధులను చేశాయి. భాగ్యశ్రీ కెరీర్ హిందీ చిత్రం యారియాన్ 2 ద్వారా ప్రారంభమైంది. ఆ తర్వాత తెలుగులో హరీష్ శంకర్ దర్శకత్వంలో రూపొందిన మిస్టర్ బచ్చన్ చిత్రంతో పరిచయం అయింది. ఈ చిత్రంలో భాగ్యశ్రీ తన గ్లామర్ ప్రెజెన్స్‌తో యూత్‌ని బాగా ఆకర్షించింది. అయితే ఈ సినిమా ఆశించిన విజయం సాధించకపోయినప్పటికీ ఆమె అందానికి ఉన్న ఫ్యాన్ ఫాలోయింగ్ తగ్గలేదు. పస్తుతం భాగ్యశ్రీ విజయ్ దేవరకొండ ప్రధాన పాత్రలో రూపొందుతోన్న పాన్-ఇండియా చిత్రం %ఎణ%12లో కథానాయికగా నటిస్తూ మరింత గుర్తింపును అందుకునే దిశగా అడుగులు వేస్తోంది. అలాగే రామ్ పోతినేని తో కూడా ఒక సినిమా చేసేందుకు సిద్ధమైంది. అమ్మడు ఇండస్ట్రీలో గట్టిగానే ఆఫర్స్ అందుకుంటోంది. ఇక లేటెస్ట్ ఫోటోషూట్‌లో భాగ్యశ్రీ ఎరుపు డ్రెస్ లో సంప్రదాయిక లుక్స్ తో పాటు, లేటెస్ట్ గ్లామర్ హంగులతో ఆకట్టుకుంటోంది. ఆమె బొంగురు జుట్టు, తేలికైన ఆభరణాలు ఆమె లుక్‌కు అదనపు ఆకర్షణను తెచ్చిపెట్టాయి. ప్రస్తుతం ఆమె దుల్కర్ సల్మాన్, రానా దగ్గుబాటి కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న మరో చిత్రంలో కూడా నటించనుంది. భాగ్యశ్రీ తన ఫోటోషూట్‌లతో, నిత్యం సోషల్ మీడియా ద్వారా అభిమానులను మెప్పించడంలో ముందుంది. ఈ లేటెస్ట్ ఫోటోలు ఆమె వింటేజ్ అందానికి ఒక నిదర్శనమని చెప్పుకోవచ్చు. ఆమె కెరీర్‌లో సక్సెస్ ల్యాండ్‌మార్క్ సాధిస్తే, భాగ్యశ్రీని నెక్ట్స్ జనరేషన్ స్టార్ హీరోయిన్‌గా వెలుగుతుందని చెప్పవచ్చు. ఎందుకంటే ప్రస్తుతం ఇండస్ట్రీలో హీరోయిన్స్ కొరత ఉంది. సీనియర్ బ్యూటీలు ఫామ్ లో లేరు. సక్సెస్ ట్రాక్ లో ఉన్న బ్యూటీలు బిజీగా ఉన్నారు. కాబట్టి ఓ వర్గం హీరోలకు హీరోయిన్స్ కావాల్సి ఉంది. ఈ తరుణంలో భాగ్య శ్రీకి మంచి అవకాశాలు వచ్చే ఛాన్స్ ఉంది. ఇక తన ఫోటోల ద్వారా భాగ్యశ్రీ అందం, అభినయం రెండింటినీ బలంగా చాటుతోంది. మరి ఆమె తర్వాతి చిత్రాలు మరింత గుర్తింపు తీసుకువస్తాయో లేదో చూడాలి!

### వరుణ్ తేజ్.. వరుస ఫ్లాప్స్ వచ్చినా

# రెమ్యునరేషన్ తగ్గట్లే..



మెగా ఫ్యామిలీ నుంచి వచ్చిన హీరోలు ఇప్పటికే ఎవరికి వారు ప్రత్యేకమైన స్టార్ హోదాను సంపాదించుకున్నారు. అయితే కొందరు ఈమధ్య ఎక్కువగా ఫ్లాప్స్ ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా వరుణ్ తేజ్ వరుస ఫ్లాప్‌లతో సతమతమవుతున్నాడు. ఎలాంటి సినిమా చేసినా కూడా బాక్సాఫీస్ వద్ద సరైన ఫలితం రాకపోవడంతో నిరాశలో ఉన్నాడు. రీసెంగ్ గా వచ్చిన మట్కా టాలీవుడ్ చరిత్రలోనే బిగ్గెస్ట్ ఫ్లాప్‌గా నిలిచింది. వీకెండ్ లోనే కొన్ని చోట్ల ప్రేక్షకులు లేక షోలు రద్దు కావడం ఈ మెగా హీరోకు ఇప్పటివరకు జరగనిది. ఈ పరిణామాలు వరుణ్ తేజ్‌పై నెగటివ్ టాక్ పెంచాయి. గత మూడు సినిమాలు గని, గాండీవదారి అర్జున, ఆపరేషన్ వాలెంటైన్ కూడా దారుణంగా డిజాస్టర్ అయ్యాయి. బాక్సాఫీస్ వద్ద కనీసం పది కోట్ల రేంజ్ కూడా కలెక్షన్స్ రావడం లేదంటే వరుణ్ తేజ్ మార్కెట్ రేంజ్ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇక మట్కా ఇంకాస్త ఎక్కువగానే దెబ్బ కొట్టింది. అయితే ఫ్లాప్స్ ఎన్ని వస్తున్నా కూడా వరుణ్ తేజ్ మాత్రం తన రిమ్యూనరేషన్ విషయంలో మునుపటి తరహాలోనే రూ. 7 కోట్ల రెమ్యునరేషన్ డిమాండ్ చేస్తున్నారని టాక్. తన తదుపరి ప్రాజెక్టులపై చర్చలు జరుగుతున్నా, ఈ పారితోషికాన్ని తీసుకుఉంటారు అని సమాచారం. వరుణ్ తేజ్ త్వరలోనే కొరియా కనకరాజు అనే సినిమాతో సెట్స్ మీదకు వెళ్లబోతున్నారు. ఈ చిత్రానికి మెర్లపాక గాంధీ దర్శకత్వం వహించనుండగా, కొరియాలో ఈ సినిమా ముఖ్యమైన భాగం చిత్రీకరించనున్నారు. %ఖఎ% క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్టైన్మెంట్స్ ఈ చిత్రాన్ని సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమా కోసం వరుణ్ తన స్టైల్ మార్చి కొత్త అవతారంలో కనిపించనున్నారని టాక్. దీంతోపాటు, వరుణ్ తేజ్ మరో ప్రాజెక్ట్‌కి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. విక్రమ్ సిరికొండ దర్శకత్వంలో రూపొందబోతున్న ఈ సినిమా ఒక కొత్త తరహా లవ్ స్టోరీగా తెరకెక్కనుంది. ఈ చిత్రం ప్రధానంగా %ఖూూ%లో చిత్రీకరించబడనుంది. ఈ సినిమాను మైత్రి మూవీ మేకర్స్ నిర్మించనున్నారు. ఈ రెండు ప్రాజెక్టులకు వరుణ్ తేజ్ అందుకునే రెమ్యునరేషన్ రూ. 7 కోట్లు అని ఇండస్ట్రీలో టాక్ వినిపిస్తోంది. వరుసగా ఫ్లాప్‌లు ఎదుర్కొన్నప్పటికీ, తన పారితోషికంలో మాత్రం వరుణ్ అస్సలు తగ్గడం లేదు. ఇక కెరీర్‌కి కీలకమైన తదుపరి రెండు చిత్రాలు విజయవంతమైతే, వరుణ్ తిరిగి ఫామ్‌లోకి వచ్చే అవకాశం ఉంది. తనకు తగిన కథలు, వైవిధ్యమైన పాత్రలను ఎంచుకుంటూ ముందుకు సాగుతున్న వరుణ్ తేజ్‌కి ఈ సినిమాలు టర్నింగ్ పాయింట్ అవుతాయేమో చూడాలి.


### భారత్‌లో ఇదే తొలి డాల్బీ సినిమా..

# 'పుష్ప2'తో కింగ్ ప్రయోగం



2024 మోస్ట్ అవైటెడ్ మూవీ పుష్ప 2 డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఇటీవలే విడుదలైన ట్రైలర్ తో ఈ భారీ పాన్ ఇండియా మూవీపై హైప్ అత్యంత భారీగా పెరిగింది. ఇంతలోనే ఇప్పుడు ఈ హైప్ ని మరింతగా పెంచుతూ భారతదేశంలో ఎన్నడూ లేని టెక్నాలజీని పుష్ప 2తో పరిచయం చేసేందుకు పాపులర్ అన్నపూర్ణ స్టూడియోస్ ప్రయత్నిస్తోందని తెలిసింది. పుష్ప 2-తో అన్నపూర్ణ స్టూడియోస్ డాల్బీ సినిమా -డాల్బీ విజన్‌ని ప్రారంభించనుంది. కింగ్ నాగార్జున ఇఫీ ఉత్సవాల్లో స్వయంగా దీని గురించి ప్రకటించారు. ఇటీవల నాగార్జున ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా(ఇఫీ 2024-గోవా)లో పాల్గొన్నారు. అక్కడ అతడు ఒక హీరోగా ఫిలింమేకర్ గా చాలా ఆలోచనలను షేర్ చేసారు. ఇదే సమయంలో భారత్‌లో డాల్బీ విజన్‌ను ప్రవేశపెడుతున్నట్లు నాగార్జున ప్రకటించారు. ఈ సందర్భంగా నాగ్ మాట్లాడుతూ.. డాల్బీ సినిమా, డాల్బీ విజన్‌లను తమ అన్నపూర్ణ స్టూడియోస్‌కు తీసుకురావాలని తమ కుటుంబ సభ్యులు సమిష్టిగా నిర్ణయించుకున్నామని, పుష్ప 2-తో దాన్ని ప్రారంభించాలని యోచిస్తున్నామని పేర్కొన్నారు. భారత్‌లో ఇదే తొలి డాల్బీ సినిమా అవుతుందని, డాల్బీ ప్రతినిధులు ఇప్పటికే అన్నపూర్ణ స్టూడియోస్‌ని సందర్శించారని, సకల సౌకర్యాలతో వారిని మెప్పించాక డీల్‌ను ఖరారు చేశారని నాగార్జున వివరించారు. ఎవరైనా డాల్బీ సినిమా చేయాలనుకునే వారు తమ స్టూడియోకి రావాలని ఆయన అన్నారు. పుష్ప 2-తో అన్నపూర్ణ స్టూడియోస్ డాల్బీ సినిమా - డాల్బీ విజన్ ప్రారంభించడంతో అభిమానులు, పరిశ్రమ నిపుణులు ఈ సాంకేతికత ఎలా పని చేస్తుందో చూడాలని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నటించిన "పుష్ప 2" డిసెంబర్ 5న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది.

# పక్కకు తప్పుకుంటే ఇండస్ట్రీలో పనైపోయినట్లే!



సత్యదేవ్ టాలీవుడ్ ట్యాలెంటెడ్ నటుల్లో ఒకరు. క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా పరిచయమై ఇప్పుడిప్పుడే ప్రధాన పాత్రల వైపు సాగుతున్నాడు. 'గాడ్ ఫాదర్'..'ఆచార్య' లాంటి ప్రతిష్టాత్మక చిత్రాల్లో అవకాశాలు కేవలం తన ప్రతిభతోనే అందు కుంటున్నాడు. అతని నటన మెచ్చి చిరంజీవి కల్పించిన ఛాన్సులవి. 'బ్లఫ్ మాస్టర్' లాంటి సినిమా అతనికి ప్రత్యేకమైన గుర్తింపును తీసుకొచ్చింది. బాలీవుడ్ లో సైతం అవకాశాలు అందుకునే స్థాయికి ఎదిగాడు. ఇప్పటికే హిందీ సినిమా 'రామసేతు'లో నటించిన సంగతి తెలిసిందే. అప్పుడప్పుడు తెరపై హీరోగానూ మెప్పిస్తున్నాడు. 'స్కైలాబ్'..'గాడ్సే'..'గుర్తుంతా శీతాకాలం'..అంతకు ముందు పూరి తెరకెక్కించిన 'జ్యోతిలక్ష్మి' లాంటి సినిమాల్లో మెయిన్ లీడ్స్ లో నటించాడు. 'కృష్ణమ్మ..'ఫుల్ బాటిల్' లాంటి చిత్రాల్లో నటించాడు. ప్రస్తుతం సత్యదేవ్, డాలీ ధనుంజయ్ ప్రధాన పాత్రల్లో ఈశ్వర్ కార్తీక్ దర్శకత్వంలో 'జీబ్రా' అనే సినిమా చేస్తున్నాడు. ఈ సినిమా రిలీజ్ సందర్భంగా ఇండస్ట్రీలో తన అనుభవాన్ని పంచుకున్నాడు. పరిశ్ర మలో నిలదొక్కుకోవాలంటే ప్రత్యేకంగా ఏదో ఒకటి చేయాలి. ఏపాత్ర అయినా చేస్తామని నిరూపించు కోగలగాలి. హీరోగానే కాక ఎలాంటి పాత్ర అయిన పోషిస్తాడు అనే భరోసో అవతలి వారికి కల్పించాలి. ఏ నటుడికైనా అంతిమంగా కావాల్సింది ఒక బ్రేక్. అలాంటి బ్రేక్ ఒకటి వస్తే చాలు. తర్వాత దానందటదే అవకాశాలు వస్తాయి. అలాంటి నాదైన ఒక రోజు వచ్చే వరకూ ట్రాక్ మీద ఎదురు చూస్తూనే ఉండాలి. అలా కాదని వెళలిపోతే మన పని అయిపోయినట్లే. నేనైతే ఎప్పుడూ ట్రాక్ మీద ఉండేలా చూసుకుంటా. ఇప్పుడు అలాగే నిలబడ్డాను.' నాకంటూ ఓ మంచి శుక్రవారం తగిలినప్పుడు పూర్తిగా హీరో పాత్రలే చేస్తా' అన్నాడు. మొత్తానికి సత్యదేవ్ పూరి జగన్నాథ్ కొటేషన్లు బాగా ఫాలో అవుతున్నట్లు కనిపిస్తుంది. మనం ఎక్కాల్సిన రైలు బండి వచ్చే వరకూ ప్లాట్ ఫాం మీద ఎదురు చూడాల్సిందే. ఆ ట్రైన్ ఇప్పుడు రావొచ్చు...తర్వాత రావొచ్చు...కానీ ఏదో సమయంలో వస్తుంది. అప్పటి వరకూ ఎదురు చూడాలి. రైలు రాలేదని వెళ్లిపోతే గమ్యం చేరడం సాధ్యపడదని పూరి ఓ సందర్భంలో అన్నారు.

Printed, Published and Owner by K PRAVEEN KUMAR, Printed at M R P Publications, #6-3-1880,Vanasthalipuram,Ranga Reddy(Dist),Hyderabad, Telangana 500070. Published at H.NO. 2-50, Shankar palli, Ranga Reddy, Hyderabad, Telangana 501203. Editor : K PRAVEEN KUMAR. Phone number 9177920459 , email : prajakshetram1@gmail.com , https://prajakshetram.in , RNI NO. TELTEL/12330